


3 లో

ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారానికి సమన్వయ కార్యాచరణ

RNI : APTEL/2023/87662

# సింధూర దర్శిని

జాతీయ తెలుగు దినపత్రిక

ప్రతి అక్షరం అవినీతి పై సమరం

WWW.SINDHURADARSINI.COM WWW.EPAPER.SINDHURADARSINI.COM

విలేకరులు కావలెను

సింధూరదర్శిని జాతీయ తెలుగు దినపత్రికలో జిల్లాల వారీగా పనిచేయుటకు జిల్లా ఇన్చార్జీలు మరియు మండలాల వారీగా పనిచేయుటకు విలేకరులు కావలెను. ఎలాంటి వేతనం ఇవ్వబడదు. యాడ్స్ పై ఆకర్షణీయమైన కమిషన్ ఇవ్వబడును. అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడును. వివరాల కొరకు బయోడేటాతో క్రింది నంబర్‌ను సంప్రదించండి.

సెల్ నెంబర్ : 7 5 6 9 6 7 7 1 7 0

ప్రచురణ: తిరుపతి సంపుటి:3 సంచిక :253 సంపాదకులు: కలిచేటి వెంకయ్య శనివారం 8 ఆగస్టు 2026 పేజీలు: 8 వెల:2

Circulated At :Tirupathi, Chittoor, Kadapa, SPSR Nellore, karnool, Prakasam, Hydrabad

పంచాంగం: శ్రీ పరాభవ నామ సంవత్సరం దక్షిణాయనం- గ్రీష్మ ఋతువు ఆషాఢ మాసం - బహుళ పక్షం తిథి : దశమి ఉ11.17 వరకు వారం : శనివారం (స్థిరవాసరే), నక్షత్రం : రోహిణి మ3.21 వరకు యోగం : ధృవం ఉ8.26 వరకు తదుపరి వ్యాఘాతం తె5.11 వరకు కరణం: భద్ర ఉ11.17 వరకు తదుపరి బవ రా10.03 వరకు వర్జ్యం: ఉ7.51 - 9.21 మరల రా8.33 -10.02 దుర్ముహూర్తము : ఉ5.44 -7.25 అమృతకాలం : మ12.21-1.51 మరల తె5.29 నుండి రాహుకాలం: ఉ9.00 - 10.30 యమగండ/కేతుకాలం : మ1.30 - 3.00 సూర్యరాశి: కర్కాటకం ॥ చంద్రరాశి: వృషభం సూర్యోదయం: 5.44 ॥ సూర్యాస్తమయం: 6.28

# భయపడొద్దు..నేనున్నాను

టీఎంసీ-శివసేన రెబల్స్‌కు ప్రధాని మోదీ భరోసా

ఎన్డీఏ కొత్త ఎంపీలతో ప్రధాని మోదీ బ్రేక్‌ఫాస్ట్ మీటింగ్

టీఎంసీ, శివసేన రెబల్ ఎంపీలకు అభయమిచ్చిన ప్రధాని

"ఆందోళన వద్దు, నేను మీతో ఉన్నాను" అంటూ భరోసా

పార్లమెంటు కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొనాలని ఎంపీలకు సూచన



**న్యూఢిల్లీ:** ప్రధాని నరేంద్ర మోదీ ఎన్డీయేలోని నూతన మిత్రపక్షాలకు, ముఖ్యంగా తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ), శివసేన (ఉద్ధవ్ వర్గం) నుంచి వచ్చిన రెబల్ ఎంపీలకు కీలక భరోసా ఇచ్చారు. "ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు, నేను మీకు అండగా ఉంటాను" అని ఆయన అభయమిచ్చారు. శుక్రవారం ఉదయం తన నివాసంలో సుమారు 45 మంది ఎన్డీయే ఎంపీలతో ఏర్పాటు చేసిన అల్పాహార సమావేశంలో ప్రధాని ఈ వ్యాఖ్యలు చేశారు.

పార్లమెంటు వర్షాకాల సమావేశాలకు పదేపదే అంతరాయం కలుగుతున్న నేపథ్యంలో ఈ భేటీ ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ సమావేశంలో తృణమూల్ రెబల్స్‌తో ఏర్పడిన నేషనలిస్ట్ సిటిజన్స్ పార్టీ ఆఫ్ ఇండియా (ఎన్‌సీపీఐ), ఉద్ధవ్ ఠాక్రే వర్గం నుంచి ఏక్‌నాథ్ షిండే వర్గంలో చేరిన శివసేన ఎంపీలు, ఎన్సీపీ (అజిత్ పవార్) సభ్యులు పాల్గొన్నారు. సభలో గందరగోళం కారణంగా కొత్త ఎంపీలకు మాట్లాడే అవకాశం రాకపోవడం అన్యాయమని ప్రధాని అభిప్రాయపడ్డారు.

ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ, పార్లమెంటును ప్రజాస్వామ్య దేవాలయంగా అభివర్ణించారు. సభా కార్యకలాపాలు సజావుగా సాగాల్సిన అవసరాన్ని ఆయన నొక్కిచెప్పారు. పార్లమెంటు చరిత్రను అధ్యయనం చేసి, చర్చలకు సిద్ధం కావాలని ఎంపీలకు సూచించారు. రాష్ట్రాలు అభివృద్ధి చెందితేనే దేశం పురోగమిస్తుందని పేర్కొంటూ, తమ నియోజకవర్గాల అభివృద్ధి పనుల నిమిత్తం నేరుగా ప్రధానమంత్రి కార్యాలయాన్ని సంప్రదించవచ్చని తెలిపారు.

"ఎన్డీయే ఒక కుటుంబం. కూటమిలోని ప్రతి పార్టీకి, ప్రతి ఎంపీకి తగిన గౌరవం ఉంటుంది. నేను ప్రతి ఎంపీకి అండగా ఉంటాను" అని మోదీ హామీ ఇచ్చారు. అనంతరం ఆయన ప్రతి ఒక్కరితో వ్యక్తిగతంగా మాట్లాడారు. ముఖ్యంగా మహారాష్ట్రకు చెందిన షిండే వర్గం ఎంపీలతో మరాఠీలో సంభాషించడం విశేషం.

# చట్టం చేస్తున్నాం... బీసీలకు సంరక్షణ కల్పిస్తాం

చేనేతలకు మేలు చేసేది... అండగా నిలిచేది కూటమి ప్రభుత్వమే - ఆర్థిక కష్టాలున్నా సంక్షేమం-అభివృద్ధిలో రాజీపడడం లేదు

కుటుంబానికి ఇల్లు... రాష్ట్రానికి రాజధాని అవసరం - మాది బ్రాండ్ ఇమేజ్... వాళ్లది బ్యాడ్ ఇమేజ్

జన్-జీ అభివృద్ధి కోరుకుంటోంది... జనరేషన్ గొడ్డలి కుట్రలు పన్నుతోంది

44 ఏళ్లు వస్తే వయసైపోయినట్టా...? - 12వ జాతీయ చేనేత దినోత్సవంలో సీఎం చంద్రబాబు

చీరాలలో నేతన్న సేవలో పథకం ప్రారంభం

కుటుంబానికి రూ.25 వేలు చొప్పున 71,536 కుటుంబాలకు రూ. 179 కోట్లు జమ చేసిన సీఎం చంద్రబాబు




**చీరాల, సింధూరదర్శిని:**
బీసీల సంరక్షణను చేపట్టే బాధ్యత కూటమి ప్రభుత్వానిదేనని దీనికోసం త్వరలోనే చట్టం చేస్తున్నామని ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు ప్రకటించారు. బీసీ సంరక్షణ చట్టంకోసం ముసాయిదా సిద్దమైందని వెల్లడించారు. శుక్రవారం 12వ జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా బాపట్ల జిల్లా చీరాల నియోజకవర్గంలోని కొత్తపేట గ్రామంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. జాతీయ చేనేతదినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన నేతన్న సేవలో సంక్షేమ పథకాన్ని సీఎం ప్రారంభించారు. రాష్ట్రంలోని అర్హులైన చేనేత కుటుంబాలకు రూ. 25 వేల చొప్పున ఆర్థిక సాయాన్ని సీఎం అందించారు. మొత్తంగా 71,536 చేనేత కుటుంబాలకు రూ.179 కోట్లను సీఎం చంద్రబాబు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ కార్యక్రమాలను ముఖ్యమంత్రి వివరించారు. అలాగే రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఇబ్బందుల్లో ఉన్నా... రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమం-అభివృద్ధి విషయంలో ఎక్కడా రాజీ పడడం లేదని ముఖ్యమంత్రి వెల్లడించారు. అలాగే రాష్ట్రంలో జరుగుతున్న ప్రగతిని అడ్డుకునేలా జరుగుతున్న కుట్రల పట్ల ప్రజలు అప్రమత్తతో ఉండాలని సూచించారు. ఇలాంటి వారి విషయంలో ప్రభుత్వం కఠినంగా ఉంటుందని... ప్రజలు కూడా కుట్రలు పన్నే వారి నైజాన్ని గమనించాలని కోరారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ స్వదేశీ

# డీఎస్సీ లీకేజీపై సీబీఐ విచారణకు భయమెందుకు?: జగన్



**అమరావతి, సింధూరదర్శిని:**
డీఎస్సీ-2025 ప్రశ్నాపత్రం లీకేజీ, నియామకాల్లో అక్రమాలపై రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు తెలుపుతున్న నిరుద్యోగ యువతపై ప్రభుత్వం దాడులకు పాల్పడుతోందని వైసీపీ అధినేత జగన్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కుమారుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ను కాపాడేందుకే ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభుత్వాన్ని ఇంతగా దిగజార్చుతున్నారని ఆయన ఘాటుగా విమర్శించారు. డీఎస్సీ అక్రమాలపై సీబీఐ విచారణకు ప్రభుత్వం ఎందుకు వెనుకాడుతోందని సూటిగా ప్రశ్నించారు. ఈ మేరకు జగన్ ఒక ప్రకటన విడుదల చేశారు. డీఎస్సీ అక్రమాలపై సీబీఐ విచారణ మిగతా 2లో...

# తిరుమల ఘాట్ రోడ్డులో ప్రమాదం

లోయలో పడిన కారు, ఒకరి మృతి

ప్రమాదంలో బెంగళూరుకు చెందిన సతీశ్ కుమార్ మృతి

శ్రీవారి దర్శనం చేసుకుని తిరిగి వెళుతుండగా ఘటన

మరో నలుగురు కుటుంబ సభ్యులకు స్వల్ప గాయాలు



**తిరుమల, సింధూరదర్శిని:**
తిరుమలలో విషాదం నెలకొంది. శ్రీవారి దర్శనం అనంతరం తిరిగి వెళుతున్న భక్తుల కారు అదుపుతప్పి లోయలో పడటంతో ఒకరు చికిత్స పొందుతూ మృతి చెందగా, మరో నలుగురు స్వల్పంగా గాయపడ్డారు. ఈ ప్రమాదం శుక్రవారం తిరుమల నుంచి తిరుపతికి వచ్చే మొదటి ఘాట్ రోడ్డులో చోటుచేసుకుంది. మిగతా 2లో...

# ఆగస్టు నెలలోనే వెలిగొండ ప్రాజెక్టుకు కృష్ణా జలాలు



**విజయవాడ, సింధూరదర్శిని:**
ఫ్లోరైడ్ బాధిత, వెనుకబడిన ప్రకాశం జిల్లాకు మూడు దశాబ్దాల కలగా ఉన్న వెలిగొండ ప్రాజెక్టుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారి నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ఈ ఆగస్టు కృష్ణానెలలోనే కృష్ణా జలాలు తీసుకెళ్ళేందుకు చర్యలు వేగవంతం చేసిందని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. వెలిగొండ ప్రాజెక్టును 2026 ఆగస్టు నాటికి పూర్తి చేయాలనే లక్ష్యాన్ని 2024లోనే నిర్దేశించుకున్నామని, ఆ లక్ష్యానికి అనుగుణంగా గత రెండేళ్లలో దాదాపు రూ.3,000 కోట్లు వెచ్చించి రాత్రింబవళ్లు పనులు చేపట్టామని మంత్రి తెలిపారు. ప్రస్తుతం ప్రాజెక్టులోని వివిధ పనులు 90 నుంచి 99 శాతం వరకు పూర్తయ్యాయని వెల్లడించారు. ప్రాజెక్టు లో మిగిలిన పనుల పురోగతిపై అధికారులు, ఏజెన్సీలతో శుక్రవారం విజయవాడ క్యాంపు కార్యాలయంలో సుదీర్ఘంగా సమీక్ష నిర్వహించి, నిర్ణీత గడువులోగా అన్ని పనులు పూర్తి చేసేలా కార్యాచరణ రూపొందించినట్లు మిగతా 2లో...

# గిరిజన గ్రామాలు... అడవి తల్లి బాటలు

మిగిలిన పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశం

అటవీ అనుమతులు జాప్యం లేకుండా సమన్వయం చేసుకోవాలి

వర్షాల వల్ల ఆటంకాలు ఉన్న రోడ్లు మినహా మిగిలిన పనులు కొనసాగించాలి

డోలీ రహిత ఆంధ్రప్రదేశ్ లక్ష్యంలో ప్రతి ఒక్కరు భాగస్వాములవ్వాలని పిలుపు



**అమరావతి, సింధూరదర్శిని:**
రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి పవన్ కళ్యాణ్ పర్యవేక్షణలో డోలీరహిత గిరిజన గ్రామాలు లక్ష్యంగా చేపట్టిన అడవితల్లి బాట పనులు స్పష్టమైన పురోగతి దిశగా సాగుతున్నాయి. అడవితల్లి బాట తొలి దశలో రూ. 1,005 కోట్ల అంచనా వ్యయంతో 1,069 కిలోమీటర్ల మేర రహదారుల అభివృద్ధికి శ్రీకారం చుట్టడం జరిగింది. మిగతా 2లో...

# డీఎస్సీ లీకేజీపై సీబీఐ విచారణకు భయమెందుకు?: జగన్

**(మొదటిపేజీ తరువాయి)**

కోరుతూ విజయవాడలో శాంతియుతంగా రిలే నిరాహార దీక్ష చేస్తున్న వారిపై అధికార పార్టీ ఎమ్మెల్యే, ఆయన అనుచరులు దాడి చేసి, శిబిరాన్ని ధ్వంసం చేశారని జగన్ ఆరోపించారు. పోలీసుల కళ్లెదుటే ఈ దౌర్జన్యం జరిగిందని, టెంట్లు పీకేసి మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు సహా నిరుద్యోగులపై రాళ్లు, కోడిగుడ్లు, టమాటాలతో దాడి చేశారని పేర్కొన్నారు. మహిళలని కూడా చూడకుండా దాడులకు తెగబడ్డారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఈ దాడులు కేవలం విజయవాడకే పరిమితం కాలేదని, రాష్ట్రవ్యాప్తంగా దీక్షా శిబిరాలపై నిర్బంధకాండ కొనసాగుతోందని జగన్ తెలిపారు. చిలకలూరిపేట, కనిగిరి, యాడికి, తాడిపత్రి, పలమనేరు, రేపల్లె, గుంటూరు, పొన్నూరు, వేమూరు, మాచర్ల, గురజాల, కందుకూరు, బాపట్ల వరకు పలుచోట్ల నిరసన శిబిరాలపై దాడులు చేసి, నాయకులను నిర్బంధించారని వివరించారు. శాంతియుతంగా ప్రశ్నించే హక్కును కూడా నిరుద్యోగ యువతకు లేకుండా చేశారని మండిపడ్డారు. డీఎస్సీ ప్రక్రియ పారదర్శకంగా జరిగిందని చెబుతున్నప్పుడు సీబీఐ విచారణకు ఎందుకు భయపడుతున్నారని ప్రభుత్వాన్ని నిలదీశారు.

ఈ సందర్భంగా జగన్ ప్రభుత్వం ముందు మూడు ప్రధాన డిమాండ్లు ఉంచారు.

1. డీఎస్సీ నియామకాల్లో జరిగిన అక్రమాలకు నైతిక బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తక్షణమే రాజీనామా చేయాలి.
2. ప్రస్తుతం రూ.9,000 కోట్లకు చేరిన విద్యా దీవెన, వసతి దీవెన బకాయిలను వెంటనే విడుదల చేయాలి.
3. ఎన్నికల మేనిఫెస్టోలోని సూపర్ సిక్స్ హామీ ప్రకారం నిరుద్యోగ యువతకు నెలకు రూ.3,000 చొప్పున గత రెండేళ్ల బకాయిలతో సహా నిరుద్యోగ భృతిని తక్షణమే చెల్లించాలి.

“చంద్రబాబు గారూ... మీరు దీక్షా శిబిరాలను ధ్వంసం చేయవచ్చు, పోలీసులను ప్రయోగించి అరెస్టులు చేయించవచ్చు. కానీ డీఎస్సీ లీకేజీ ఆధారాలను చెరిపేయలేరు. నిరుద్యోగ యువతలో రగులుతున్న ఆగ్రహాన్ని అణచివేయలేరు. న్యాయం జరిగే వరకు ఈ పోరాటం ఆగదు” అని జగన్ తన ప్రకటనలో స్పష్టం చేశారు.

# తిరుమల ఘాట్ రోడ్డులో ప్రమాదం

**(మొదటిపేజీ తరువాయి)**

బెంగళూరులోని గొట్టిగెరెకు చెందిన సతీష్ కుమార్ (72) తన కుటుంబ సభ్యులతో కలిసి శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వచ్చారు. స్వామివారి దర్శనం ముగించుకుని కారులో తిరుగు ప్రయాణమైన క్రమంలో, 22వ హెయిర్‌పిన్ బెండ్ వద్ద వాహనం అదుపుతప్పింది. వేగంగా వెళుతూ రక్షణ గోడను ఢీకొట్టిన కారు, సుమారు 15 అడుగుల లోతులో ఉన్న లోయలో పడిపోయింది. ఈ ప్రమాదంలో సతీష్ కుమార్ కుమారుడు సాయి శ్రీనివాస్, కుమార్తె సింధు ఉడత్, మనవరాళ్లు తియా, నైరాలకు స్వల్ప గాయాలయ్యాయి. ప్రమాదం సమాచారం అందుకున్న పోలీసులు, సహాయక బృందాలు తక్షణమే ఘటనా స్థలానికి చేరుకున్నాయి. క్షతగాత్రులను తిరుపతిలోని స్విమ్స్ ఆసుపత్రికి తరలించి మెరుగైన చికిత్స అందిస్తున్నారు. సతీశ్ కుమార్ చికిత్స పొందుతూ మృతి చెందారు. ఈ ఘటనతో ఆ కుటుంబంలో తీవ్ర విషాదం అలుముకుంది.

# ఆగస్టు నెలలోనే వెలిగొండ ప్రాజెక్టుకు కృష్ణా జలాలు

**(మొదటిపేజీ తరువాయి)**

మంత్రి తెలిపారు.

**టన్నెల్ పనులు శరవేగంగా**

కొల్లంవాగు నుంచి కృష్ణా జలాలు టన్నెల్‌కు చేరే అప్రోచ్ ఛానెల్ పనులు పూర్తయ్యాయని, హెడ్ రెగ్యులేటర్‌కు సంబంధించిన గేట్ల పనులు కూడా పూర్తి చేసినట్లు మంత్రి వెల్లడించారు. టన్నెల్--1, టన్నెల్--2లకు సంబంధించిన 286 మీటర్ల సిసి లైనింగ్ పనులను ఈ నెల 18వ తేదీలోగా పూర్తి చేసేలా, ఐదు గ్యాంట్రీలతో ప్రత్యేక షెడ్యూల్ రూపొందించినట్లు తెలిపారు. వెలిగొండ టన్నెల్‌లో ఉన్న 1,900 మెట్రిక్ టన్నుల బరువు, 175 మీటర్ల పొడవు కలిగిన ౦దీవీ మిషన్‌లో ఇప్పటికే 70 శాతం వరకు తొలగింపు పనులు పూర్తయ్యాయని మంత్రి తెలిపారు. మిగిలిన 30 శాతం పనులను కూడా రాబోయే 7 నుంచి 10 రోజుల్లో పూర్తి చేసేలా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసినట్లు వెల్లడించారు. ఐతే 5 ఏళ్ళ గొడ్డలి పార్టీ పాలనలో టిబిఎం ను అంగుళం కూడా కదపలేదని, చుక్కనీరు కూడా బయటకు వెళ్ళే పరిస్దితి లేదని, అయినా కూడా జాతికి అంకితం పేరుతో ప్రజల్ని మోసం, దగా చేశారని దుయ్యబట్టారు.

**ఫీడర్ కెనాల్ పనుల్లో గణనీయమైన పురోగతి**

100 క్యూసెక్కుల నీరు వస్తేనే బండ్ లు తెగిపోయే పరిస్దితి ఉన్న ఫీడర్ కెనాల్ ను బలోపేతం చేసేలా, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారు రూ.460 కోట్లు మంజూరు చేసి, ఈ ఏడాది జనవరిలో పనులకు శంకుస్థాపన చేసినట్లు మంత్రి తెలిపారు. ఇప్పటికే 5.3 కిలోమీటర్ల సీసీ వాల్ పనులు పూర్తయ్యాయని, మొత్తం 11 కిలోమీటర్ల లైనింగ్ పనులను 5 నెలల్లో పూర్తి చేసినట్లు చెప్పారు. ఫీడర్ కెనాల్‌కు సంబంధించిన ఈస్ట్రన్ మెయిన్ కెనాల్, సుంకేసుల, గొట్టిపడియ రెగ్యులేటర్ల పనులను ఈ నెల 15వ తేదీలోగా పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు.

ప్రాజెక్టు పూర్తి చేయడానికి అత్యంత కీలకమైన నిర్వాసితులకు 900 కోట్ల పరిహారం ఇవ్వవలసి ఉండగా, ఒక్క నయా పైసా కూడా ఇవ్వకుండా, గత ప్రభుత్వం వారిని అత్యంత చులకనగా చూసిందని తెలిపారు. కూటమి ప్రభుత్వం వెలిగొండ నిర్వాసితులకు అండగా నిలబడి, ఇప్పటికే 2,560 నిర్వాసిత కుటుంబాలకు రూ.318 కోట్లు వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేసినట్లు వెల్లడించారు. మిగిలిన 4,761 కుటుంబాలకు రూ.600 కోట్లను రెండు విడతల్లో అందించనున్నట్లు తెలిపారు. మొదటి విడతగా రూ.300 కోట్లు ఈ వారంలో, మరో రూ.300 కోట్లు రాబోయే మూడు నుంచి నాలుగు వారాల్లో అందించేలా ముఖ్యమంత్రి ఆదేశాలు జారీ చేశారని మంత్రి పేర్కొన్నారు.

**మాట నిలబెట్టుకుంటున్న కూటమి ప్రభుత్వం**

గత ఐదేళ్లలో నిలిచిపోయిన వెలిగొండ ప్రాజెక్టు పనులను కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే వేగవంతం చేసిందని మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. నిధులు సమకూర్చడంతో పాటు నిర్వాసితులకు పరిహారం అందిస్తూ, టన్నెల్స్, ఫీడర్ కెనాల్, రెగ్యులేటర్ల పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేస్తున్నామని చెప్పారు. ఈ సమీక్షలో జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శశిభూషణ్ కుమార్, సలహాదారులు ఎం. వెంకటేశ్వరరావు, ఈఎన్సీ నరసింహమూర్తి, సిఈ రమేష్ బాబు, ఎస్ఈ అబూతలేం మరియు ఈఈలు, ఏజెన్సీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# చట్టం చేస్తున్నాం...బీసీలకు సంరక్షణ కల్పిస్తాం







**(మొదటిపేజీ తరువాయి)**

ఉద్యమ స్ఫూర్తిని గుర్తు చేసుకునేలా ఆగస్ట్ 7న జాతీయ చేనేత దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం. ఇది మరపురాని రోజుగా ఉండాలనే నేతన్న సేవలో... పథకాన్ని ప్రారంభించాం. ఎన్నికల్లో ఇచ్చిన హామీలే కాదు... చెప్పని వాటినీ అమలు చేస్తున్నామనడానికి నేతన్న సేవలో పథకమే నిదర్శనం. చేనేత కేవలం ఒక వృత్తే కాదు... భారతీయ సంస్కృతికి ప్రతీక. దేశం గర్వించే కళ చేనేత. మన రాష్ట్రం అనేక చేనేత కళలకు నిలయం. అలాంటి వర్గానికి ఆసరాగా ఉంటున్నాం. చీరాల, వెంకటగిరి, ధర్మవరం, ఉప్పాడ, మంగళగిరి, పొందూరు, పెడన, శ్రీకాళహస్తి, నరసాపురం... ఇలా రాష్ట్రంలో అనేక చేనేత ఉత్పత్తులు విశిష్ట గుర్తింపు పొందాయి. 1.27 లక్షల మంది చేనేత రంగంపై ఆధారపడి జీవిస్తున్నారు. నేతన్న సేవ పథకమే కాదు... ఇప్పటికే నేతన్నలకు ఉచిత విద్యుత్ అందిస్తున్నాం. చేనేత కుటుంబాలకు నెలకు 200 యూనిట్లు, పవర్‌లూమ్ యూనిట్లకు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇస్తున్నాం. 62,541 చేనేత కుటుంబాలు, 10,032 పవర్‌లూమ్ యూనిట్లకు ప్రయోజనం కలుగుతోంది. చేనేతలకు 50 ఏళ్లకే ఎన్టీఆర్ పెన్షన్ భరోసా పెన్షన్ అందిస్తున్నాం. 85 వేల మంది చేనేతలకు ఫించన్‌గా రూ.4 వేల చొప్పున నెలకు రూ.35 కోట్లు ఇస్తున్నాం. రూ.420 కోట్లు ఏడాదికి ఖర్చు పెడుతున్నాం. రాష్ట్రంలోని 109 ప్రాథమిక చేనేత సహకార సంఘాలకు క్యాష్ క్రెడిట్ ద్వారా రూ.79 కోట్లు ఇచ్చాం. స్మాల్ క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం కింద రూ.10 కోట్ల వ్యయంతో 10 చేనేత క్లస్టర్లకు ఆమోదం పొందాయి. హ్యాండ్లూమ్ మార్కెటింగ్ అసిస్టెన్స్ కార్యక్రమంతో నేత కార్మికులకు నేరుగా మార్కెట్ అవకాశాలు వచ్చాయి. ఉప్పాడలో ప్రత్యేక మౌలిక సదుపాయాల ప్రాజెక్టు, మంగళగిరిలో హ్యాండ్లూమ్ పార్కు ఏర్పాటు చేస్తున్నాం. అమరావతిలోని శాఖమూరులో చేనేత, హస్తకళల మ్యూజియం కూడా వస్తోంది. విశాఖపట్నంలో రూ.4,200 కోట్ల పెట్టుబడితో సుస్థిర టెక్స్‌టైల్ రీసైక్లింగ్ యూనిట్ ఏర్పాటు కానుంది.”అని సీఎం చంద్రబాబు అన్నారు.

**బీసీలకు అండగా...**

“బీసీలకు కూటమి ప్రభుత్వం పూర్తి స్థాయిలో అండగా నిలుస్తోంది. వారి సంక్షేమం కోసం పని చేయడంతో పాటు... రక్షణ కల్పించేందుకు చట్టం చేస్తున్నాం. దీని కోసం ముసాయిదా ఇప్పటికే సిద్ధమైంది. ఇక బీసీల సంక్షేమంలో భాగంగా వివిధ వర్గాలను అన్ని రకాలుగా అభివృద్ధి సాధించేలా చర్యలు తీసుకుంటున్నాం. చేపల వేట నిషేధ సమయంలో 1.34 లక్షల మత్స్యకార కుటుంబాలకు రూ.20 వేల చొప్పున రెండేళ్లలో రూ.505 కోట్లు ఇచ్చాం. వడ్డెరలకు మైనింగ్ లీజులు, గీత కార్మికులకు ఎక్సైజ్ షాపులు కేటాయిం చాం. సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటుకు బీసీలకు 3 కిలో వాట్లకు అదనంగా రూ.20 వేలు సబ్సిడీ ఇస్తున్నాం. రాష్ట్రంలో అందరికీ రూ.2.5 లక్షల చొప్పున యూనివర్సల్ హెల్త్ ఇన్సూరెన్స్ తీసుకువస్తున్నాం. అభివృద్ధితో పాటు సంక్షేమం, సుపరిపాలనను అందించేలా కూటమి ప్రభుత్వం పని చేస్తోంది. పేదలు భోజనానికి ఇబ్బం దులు పడకుండా రూ.5 అన్నా క్యాంటీన్లో భోజనం అందిస్తున్నాం. కొందరు వ్యక్తులు దీనికీ అడ్డం పడి అన్నా క్యాంటీన్లను ఎత్తేశారు. విద్య అందరికీ అందాలన్న లక్ష్యంతో తల్లికి వందనం పథకం కింద ఎంతమంది పిల్లలు ఉంటే అందరికీ.. వారి తల్లుల ఖాతాలో డబ్బులు






జమ చేస్తున్నాం. సంక్షేమంతో పాటు అభివృద్ధిపైనా శ్రద్ధ పెడుతున్నాం. గత పాలనలో రోడ్లన్నీ గుంతలే. మన రాష్ట్రాన్ని చూసి ఎగతాళి చేశారు... ఇప్పుడు రోడ్లకు మరమ్మత్తులు చేశాం. పారిశ్రామిక వేత్తలను ఆహ్వాని ంచాం... రూ. 12 లక్షల కోట్ల మేర పెట్టుబడులు ఇప్పటికే గ్రౌండ్ అయ్యాయి. యువతకు ఉద్యోగాలు వచ్చేలా చేస్తున్నాం... అభివృద్ధి-ఉపాధి కల్పించేలా పారిశ్రామికాభివృద్ధి చేస్తున్నాం. రోడ్లు, పోర్టులు, విమానాశ్రయాలు కూడా రాష్ట్రంలో నిర్మించి రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్నాం. గత పాలకుల నిర్వాకం వల్ల ఆర్థిక ఇబ్బందులున్నా... గడచిన 2ఏళ్లల్లో పేదలను ఆదుకు ేందుకు రూ.1.50లక్షల కోట్లు సంక్షేమం చేశాం. అభివృద్ధి కోసం 2 ఏళ్లల్లో రూ.1.34 లక్షల కోట్లు ఖర్చు చేశాం. రోడ్లు సహా ఇతర మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నాం.”అని ముఖ్యమంత్రి వివరించారు.

**కుటుంబానికి ఇల్లు... రాష్ట్రానికి రాజధాని**

“గత పాలనలో రాజధాని లేకుండా చేశారు... రాష్ట్రం పేరు చెబితే ఇతర ప్రాంతాల్లో చులకన అయ్యేలా చేశారు. అద్భుతమైన నగరం ఉండాలనే అమరావతిని నిర్మిస్తున్నాం. రాజధానిపై గత పాలకులు నాలుక మడతపెట్టారు. మూడు ముక్కలాట ఆడారు. రాష్ట్రాన్ని విధ్వంసం చేశారు. దేశంలో ఏ రాష్ట్రమైనా తమ రాజధాని నగరాలను ఘనంగా చెప్పుకుంటున్నాయి. గత పాలనలో రాజధానే లేకుండా పోయింది. కూటమి అధికారంలోకి వచ్చాక అమరావతి పనులు రీస్టార్ట్ చేశాం. ఆగస్టు 13 తేదీన రాజధానిలోని ప్రధాన రాజమార్గం సీడ్ యాక్సెస్ రోడ్డు ప్రారంభం అవుతుంది. వేగంగా జరుగుతున్న పనులు చూసి రాజధానిపై మళ్లీ కుట్రలు పన్నుతున్నారు. మావిగన్, వాటికన్ అంటూ ఏవోవో చెబుతున్నారు. మళ్లీ మూడు ముక్కలాట కావాలా...? రాజధానిని విధ్వంసం చేసుకుంటామా..? కుటుంబానికి ఇల్లు, రాష్ట్రానికి రాజధాని అవసరం. గత ప్రభుత్వం రాష్ట్ర పరువును తీసేసింది. ఇమేజ్ ను దారుణంగా దెబ్బతీసింది. కూటమి వచ్చాక మళ్లీ ఏపీ బ్రాండ్ ను పునరుద్ధరించాం. పెట్టుబడులు తీసుకువచ్చి పరిశ్రమల్ని ఏర్పాటు చేయిస్తున్నాం. వాళ్లది బ్యాడ్ ఇమేజ్... మాది బ్రాండ్ ఇమేజ్. కోర్టు కేసులు వేసి అడ్డుకున్నా మెగా డీఎస్సీ ద్వారా 16 వేల ఉద్యోగాలు ఇచ్చాం. ఏడాదిన్నర తర్వాత ఇప్పుడు మళ్లీ పేపర్ లీక్ అంటూ కుట్ర రాజకీయాలు చేస్తున్నారు. కోర్టు చీవాట్లు పెట్టినా... మళ్లీ ధర్నాలు చేసి ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ప్రజలకు ఇబ్బందులు కల్పిస్తూ ప్రజలను వేధిస్తున్నారు. జెన్-జీ యువత అభివృద్ధిని కోరుకుంటోంది. కానీ కొందరు గొడ్డలి జనరేషన్ కు చెందిన వారు అభివృద్ధిని అడ్డుకుంటున్నారు. వీళ్లది గొడ్డలి జె. అభివృద్ధిని అడ్డుకునేలా చేసే అరాచకాలను ఎట్టిపరిస్థితుల్లోనూ ఉపేక్షించం. కఠిన చర్యలకు వెనుకాడం.”అని ముఖ్యమంత్రి చెప్పారు.

**కుట్రలను గమనించాలి... కుట్రదారులను దూరంపెట్టాలి**

“గంజాయి, బ్లేడ్ బ్యాచ్ లను నేరాలు, ఘోరాలు చేసే వ్యక్తుల్ని ప్రోత్సహిస్తూ కొందరు అభివృద్ధిని అడ్డుకోవాలని చూస్తున్నారు. యాక్సిడెంట్ చేస్తే గాయపడిన వ్యక్తిని ఆస్పత్రికి తీసుకెళ్లాలి... కానీ ఆధారాలు తారుమారు చేసేసి, వ్యక్తులను మార్చేసి కుట్రలు చేసి కేసు మాఫీ చేసేందుకు ప్రయత్నించారు. 44 ఏళ్ల వ్యక్తి చనిపోతే ఇబ్బందేమిటని మాట్లాడతారు. ఇదెక్కడి విడ్డూరం... ఇలాంటి వారిని ఏమనాలి..? పరామర్శల కోసం గంటల పాటు రోడ్లను నిర్బంధించి వెకిలి చేష్టలు చేస్తున్నారు. శాంతి భద్రతలను కాపాడే మహిళా పోలీసు అధికారుల విషయంలోనూ అసభ్యంగా ప్రవర్తించారు. మహిళా పోలీసుల అధికారులను కూడా గొడ్డలి గ్యాంగ్ వేధిస్తోంది. పొగాకు రైతులను పలకరించేందుకు వెళ్లి అక్కడ అరాచకం సృష్టించారు. రౌడీయిజం చేస్తూ రప్పా రప్పా అంటూ రోడ్డుపైకి వచ్చి అడ్డం పడుతున్నారు. బ్రాందీ షాపుల్లో మద్యం తాగి బట్టలు విప్పి అరాచకం సృష్టిస్తున్నారు. గంజాయి బ్యాచ్ అంతా పొగాకు నాశనం చేశారు. రైతులు అవేదన వారికి పట్టడం లేదు. ఓ దుకాణాన్ని కూడా ధ్వంసం చేశారు. ఓ వ్యక్తి వీళ్ల కుమ్ములాటలో గాయపడి ఆస్పత్రిలో చనిపోయారు. సభ్యతగా వ్యవహరించాల్సిన కొన్ని రాజకీయ పార్టీలు అసభ్యంగా, బాధ్యతా రాహిత్యంతో ప్రవర్తిస్తున్నాయి. గత పాలనలో అంతా అరాచకం రాజ్యం ఏలింది. ఇప్పుడు ప్రజలకు ఆ పరిస్థితి లేదు. కుట్రలను ప్రజలు గమనించాలి... కుట్రదారులను దూరం పెట్టాలి. ప్రజలు చైతన్యంతో వ్యవహరించాలి.”అని సీఎం చంద్రబాబు కోరారు.

**మినీ ముంబై చీరాలకు పూర్వవైభవం తెస్తాం**

“చీరాల పేరు వింటేనే ఇక్కడి నేతన్నల నైపుణ్యం గుర్తుకు వస్తుంది. చీరాల పట్టు, కాటన్ చీరలు దేశవ్యాప్తంగా గుర్తింపు పొందాయి. చీరాల ఖర్చీఫ్‌లు ఒకప్పుడు విదేశాలకు భారీగా ఎగుమతి అయ్యేవి. చేనేత ఉత్పత్తుల్లో ఒకప్పుడు ‘మినీ ముంబై’గా పేరొందిన చీరాలకు పూర్వ వైభవం తెస్తాం. పర్యాటకుల్ని ఆకట్టుకునేలా సూర్యలంక, బాపట్ల, చీరాల సముద్ర తీర ప్రాంతాలను తీర్చిదిద్దుతున్నాం. రూ. 97 కోట్ల స్వదేశ్ దర్శన్ నిధులతో సూర్యలంక నుంచి చీరాల వరకు పర్యాటక కారిడార్ ఏర్పాటు చేస్తున్నాం.”అని ముఖ్యమంత్రి చెప్పారు. తన ప్రసంగం అనంతరం బాపట్ల జిల్లాలో వివిధ శాఖలకు చెందిన అధికారుల పని తీరుపై తన వద్దనున్న నివేదికను ప్రజలకు చదివి వినిపించారు. చక్కగా పని చేసిన వారిని ప్రజలు అభినందించాలని సూచించారు. సంతృప్తికరంగా పని చేయని అధికారులను పనితీరు మరింత మెరుగు పరుచుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

# గిరిజన గ్రామాలు... అడవి తల్లి బాటలు

**(మొదటిపేజీ తరువాయి)**

ఈ కార్యక్రమాన్ని మరింత విస్తరిస్తూ అడవితల్లిబాట 2.0ను ప్రారంభించడం జరిగింది. ఈ విస్తరణతో మొత్తం ప్రాజెక్టును రూ.2,078కోట్ల అంచనా వ్యయంతో 2,310 కిలోమీటర్ల మేర రహదారుల అభివృద్ధికి విస్తరిం చడం జరిగింది. ఇందులో ఇప్పటికే 905 కిలోమీటర్ల మేర రహదారుల నిర్మాణం పూర్తైంది. అడవితల్లిబాట కార్యక్రమం మొదటి రోజు నుంచి పనుల పురోగతిపై సంబంధిత శాఖల అధికారులతో ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, పనులు వేగంగా ముందుకు తీసుకువెళ్లే విధంగా పవన్ కళ్యాణ్ సూచనలు చేస్తున్నారు.

**సవాళ్ల నడుమ రోడ్డు నిర్మాణం**

అడవితల్లిబాట కార్యక్రమంలో భాగంగా చాలా గ్రామాలకు రోడ్డు వేయడం కంటే ముందు దారి నిర్మించేందుకు సంక్లిష్ట పరిస్థితులు ఎదుర్కోవాల్సి వచ్చింది. రోడ్ల నిర్మాణంలో భాగంగా పెద్ద పెద్ద గుట్టలను కంట్రోల్డ్ బ్లాస్టింగ్ ద్వారా బ్రేక్ చేసి, రాళ్లు పగలగొట్టి దారి ఏర్పాటు చేశారు. ఆ దారిపై రోడ్ల నిర్మాణం చేపడుతున్నారు. దారులు వేసిన తర్వాత కొన్ని ప్రాంతాలకు వాతావరణ పరిస్థితులు అనుకూలించక నిర్మాణ సామాగ్రి చేరుకోవడం కష్టతరంగా మారింది. అలాంటి సవాళ్ల మధ్య గిరిశిఖర గ్రామాలకు సైతం డోలీ కష్టాల నుంచి విముక్తి కల్పించాలన్న దృఢ సంకల్పంతో ఉప ముఖ్యమంత్రివర్యుల ప్రణాళికలు ముందుకు తీసుకువెళ్తున్నారు.

**ప్రతి గిరిజన గ్రామం డోలీ రహితం కావాలి : పవన్ కళ్యాణ్**

అడవితల్లిబాట పనుల పురోగతిపై పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఉన్నతాధికారులతో సమీక్షించిన శ్రీ పవన్ కళ్యాణ్ గారు నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా పెండింగ్ పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. అటవీ అనుమతుల ప్రక్రియలో జాప్యం లేకుండా ఆయా జిల్లాల కలెక్టర్లు శాఖల మధ్య సమన్వయ బాధ్యత తీసుకుని త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత రికార్డు స్థాయిలో అభివృద్ధి కార్యక్రమాలకు అటవీ అనుమతుల ప్రక్రియ పూర్తి చేసిన విషయాన్ని గుర్తు చేశారు. వర్షాల కారణంగా పనులకు ఆటంకాలు ఏర్పడిన ప్రాంతాలు మినహా, మిగిలిన అన్ని ప్రాంతాల్లో పనులు నిరంతరాయంగా కొనసాగించాలని స్పష్టం చేశారు. గిరిజన గ్రామాలకు విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలను చేరువ చేయాలన్న బలమైన సంకల్పంతో గౌరవ ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ గారి సహకారంతో చేపట్టిన అడవితల్లి బాట పనుల్లో నాణ్యతా లోపాలకు తావు లేకుండా నిరంతర పర్యవేక్షణ వ్యవస్థలు ఏర్పాటు చేయాలని తెలిపారు. డోలీ రహిత ఆంధ్రప్రదేశ్ లక్ష్య సాధనలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

## చేనేత కార్మికులకు ఘన సన్మానం



గూడూరు( సింధూర దర్శిని) 7 ఆగస్టు నెల్లూరు జిల్లా ; చేనేత కళ ఎంతో ప్రాముఖ్యమైనదని, ప్రభుత్వాలు వీరికి రాయితీలను కల్పించి ఆదుకోవాలని ఇన్నర్ వీల్ ప్రెసిడెంట్ నిర్మల తెలియజేశారు. చేనేత కార్మికుల దినోత్సవం సందర్భంగా నెల బల్లి రెట్టపల్లి లోని చేనేత కార్మికులను వారు ఘనంగా సన్మానించారు. చిల్లకూరు మండలంలోని రెట్టపల్లి గ్రామంలో చేనేత కార్మికుల దినోత్సవాన్ని ఇన్నర్ వీల్ మరియు ఆంధ్ర మహిళా మండలి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్నర్ బిల్ క్లబ్ ప్రెసిడెంట్ నిర్మల మాట్లాడుతూ...చేనేత కళ ఎంతో ప్రాముఖ్యమైనదని, ప్రభుత్వాలు వీరికి రాయితీలను కల్పించి ఆదుకోవాలని తెలియజేశారు. అనంతరం చేనేత కార్మికులను వీరు ఘనంగా సన్మానించి, చేనేత మగ్గాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మహిళా మండలి సెక్రెటరీ విష్ణు వందన, ఎడిటర్ పవిత్ర, జాయింట్ సెక్రెటరీ డాక్టర్ దివ్య, దీప,శశిరేఖ, స్థానిక టిడిపి నాయకులు సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## తల్లిపాలతోనే బిడ్డకు ఆరోగ్యం




గూడూరు ( సింధూర దర్శిని) 7 ఆగస్టు నెల్లూరు జిల్లా ; తల్లి పాలతోనే బిడ్డకు ఆరోగ్యమని ఇన్నర్ వీల్ ప్రెసిడెంట్ నిర్మల తెలియజేశారు. తల్లిపాల వారోత్సవాల సందర్భంగా ఇన్నర్ వీల్ మరియు ఆంధ్ర మహిళా మండలి ఆధ్వర్యంలో ప్రభుత్వ వైద్యశాలలోని బాలింతలకు పౌష్టికాహారాన్ని అందజేశారు. గూడూరు పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలలో తల్లిపాల వారోత్సవాలు సందర్భంగా ఇన్నర్ వీల్ మరియు ఆంధ్ర మహిళా మండలి ఆధ్వర్యంలో బాలింతలకు పౌష్టికాహారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఇన్నర్ వీల్ మరియు ఆంధ్ర మహిళా మండలి ప్రెసిడెంట్లు నిర్మల, డాక్టర్ రోహిణి మాట్లాడుతూ...తల్లి పాలతోనే బిడ్డకు ఆరోగ్యమని, పుట్టిన వెంటనే బిడ్డకు తల్లిపాలు పట్టించడం వల్ల శిశువుకు ఎంతో ఆరోగ్యమని, తల్లిపాలు పట్టించడం వల్ల బిడ్డకు,తల్లికి మధ్య ప్రేమానురాగాలు పెరుగుతాయని, బాలింతలు పౌష్టికాహారం చేసుకుంటూ జాగ్రత్తలు వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ సూపర్నెంట్ షరీన, ఎడిటర్ పవిత్ర, సెక్రటరీ విష్ణు వందన, హాస్పిటల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పార్వతిదేవికి శాకాంబరి అలంకారం

ఆలయ చైర్మన్ బాలకృష్ణ నాయుడు



గూడూరు( సింధూరదర్శిని) 7 ఆగస్టు నెల్లూరు జిల్లా; గూడూరు పట్టణం లోని శ్రీ భువనేశ్వరి దేవి సమేత మూలస్థానేశ్వరస్వామి దేవస్థానం శివాలయంలో ఆషాడమాసం శుక్రవారం సందర్భంగా పలు రకాల పండ్లు కూరగాయలతో పార్వతి దేవికి శాకాంబరి అలంకారం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించి,తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కమిటీ చైర్మన్ అరికట్ల బాలకృష్ణ నాయుడు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

## ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులుగా పూల చంద్రశేఖర్



గూడూరు( సింధూర దర్శిని) 7 ఆగస్టు నెల్లూరు జిల్లా; ఐ ఎన్ టి యు సి ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడుగా గూడూరు పట్టణానికి చెందిన పూల చంద్రశేఖర్ ను కాంగ్రెస్ పార్టీ ఎంపిక చేయడంతో పలువురు నాయకులు చంద్రశేఖర్ ను సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. చంద్రశేఖర్ మాట్లాడుతూ గత 35 సంవత్సరాలుగా ట్రేడ్ ఐఎన్టియుసి లో పనిచేస్తున్నామని కార్మికుల సమస్యల పట్ల పూర్తిస్థాయిలో అవగాహన ఉందని సమాన పనికి సమాన వేతనం వచ్చేలా కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణారావు, ,బ్రహ్మయ్య, శ్రీనివాసులు ,రాజు ,తదితరులు పాల్గొన్నారు.

# సర్వేపల్లి కాలువకట్ట నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం

పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ - సర్వేపల్లి కాలువకట్టపై పర్యటించిన మంత్రి నారాయణ

మూడు కిలోమీటర్లపాటు మూడు గంటలు సాగిన పర్యటన

అధికారయంత్రాంగంతో కలిసి నిర్వాసితుల సమస్యలు అడిగి తెలుసుకొంటూ ముందుకు సాగిన మంత్రి

సమస్యల పరిష్కారానికి స్వయంగా తరలివచ్చిన మంత్రికి అడుగడుగు నీరాజనాలు పలికిన పేద జనం

మంగళ హారతులతో స్వాగతం పలికిన స్థానిక మహిళలు

సర్వేపల్లి కాలువకట్టపై సర్వే చేయాలని అధికారులను ఆదేశించిన మంత్రి.

తమ సమస్యకు పరిష్కారంతో పాటు కల సాకారం కానుండడంతో హర్షం వ్యక్తం చేసిన నిర్వాసితులు



నెల్లూరు( సింధూర దర్శిని) 7 ఆగస్టు నెల్లూరు జిల్లా; నెల్లూరు సిటీ నియోజకవర్గంలోని సర్వేపల్లి కాలువ కట్టపై నివసిస్తున్న నిర్వాసితుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ తెలిపారు. దాదాపు 60 ఏళ్లుగా అక్కడ నివసిస్తున్న కుటుంబాల సమస్యలను స్వయంగా తెలుసుకునేందుకు మూడు కిలోమీటర్ల మేర రెండు గంటలపాటు కాలినడకన పర్యటించిన మంత్రి, నిబంధనల ప్రకారం అవకాశం ఉంటే శాశ్వత పట్టాలు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. సర్వేపల్లి కాలువకట్టపై నివసిస్తున్న నిర్వాసితుల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకునేందుకు మంత్రి నారాయణ శుక్రవారం విస్తృతంగా పర్యటించారు. దాదాపు మూడు కిలోమీటర్ల మేర రెండు గంటలపాటు కాలినడకన సాగిన ఈ పర్యటనలో అధికార యంత్రాంగంతో కలిసి ప్రతి కుటుంబాన్ని కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మంత్రి రాకతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. మహిళలు మంగళహారతులతో స్వాగతం పలుకగా, పలుచోట్ల ప్రజలు అడుగడుగునా నీరాజనాలు పలికి తమ సమస్యల పరిష్కారం కోసం స్వయంగా వచ్చిన మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ, సర్వేపల్లి కాలువకట్టపై దాదాపు 60 ఏళ్లుగా అనేక కుటుంబాలు నివాసం ఉంటున్నాయని, వారు చాలా కాలంగా శాశ్వత పట్టాల కోసం ఎదురుచూస్తున్నారని అన్నారు. గత ప్రభుత్వం ఇచ్చినట్లుగా కేవలం పొజిషన్ సర్టిఫికెట్లు తమకు అవసరం లేదని, భగత్‌సింగ్ కాలనీలో ఇచ్చిన తరహాలో శాశ్వత పట్టాలే కావాలని స్థానికులు కోరుతున్నారని తెలిపారు. తాను ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు ప్రస్తుతం సమగ్ర సర్వే నిర్వహించాలని అధికారులను ఆదేశించానని మంత్రి చెప్పారు. సర్వే నివేదిక, నిబంధనలను పరిశీలించి అవకాశం ఉంటే అర్హులైన ప్రతి కుటుంబానికి శాశ్వత పట్టాలు మంజూరు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు. ఇరిగేషన్, రెవెన్యూ, మున్సిపల్ శాఖల మధ్య సమన్వయం ఏర్పాటుచేసి ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ప్రత్యేకంగా కృషి చేస్తానని మంత్రి నారాయణ హామీ ఇచ్చారు. సర్వే ప్రక్రియను పారదర్శకంగా, వేగంగా పూర్తి చేసి ప్రజలకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికా రులను ఆదేశించారు. మంత్రి హామీతో నిర్వాసితులు ఆనందం వ్యక్తం చేస్తూ, దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న తమ కల నెరవేరుతుందనే ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ పర్యటనలో నెల్లూరు నగర మేయర్ సుజాత, కమిషనర్ నందన్, ఎంఆర్ఓ వెంకటలక్ష్మి, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ అనూరాధ, మాజీ జడ్పీటీసీ విజేతా రెడ్డి, స్థానిక టీడీపీ నాయకులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారానికి సమన్వయ కార్యాచరణ

అన్ని శాఖలతో కలిసి దశలవారీ కార్యాచరణ ప్రణాళిక అమలు:జిల్లా ఎస్పీ అజితా వేజెండ్ల



నెల్లూరు( సింధూర దర్శిని) 7 ఆగస్టు నెల్లూరు జిల్లా ; నెల్లూరు నగరంలో ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించి ప్రజలకు సౌకర్యవంతమైన, సురక్షితమైన రవాణా వ్యవస్థను అందించేందుకు జిల్లా ఎస్పీ డా. అజితా వేజెండ్ల, అధ్యక్షతన జిల్లా పోలీసు కార్యాలయంలో మున్సిపల్, ఆర్టీసీ, ఆర్ ఌ బి, విద్యుత్ తదితర సంబంధిత శాఖల అధికారులతో సమన్వయ సమీక్ష సమావేశం నిర్వహించారు. నగరంలోని ట్రాఫిక్ రద్దీ ప్రాంతాలను గుర్తించి, ట్రాఫిక్ సిగ్నల్స్, పార్కింగ్ మరియు నో-పార్కింగ్ జోన్ల క్రమబద్ధీకరణ, రహదారులపై ఉన్న అవరోధాల తొలగింపు, ఆక్రమణల నివారణ, ప్రత్యామ్నాయ పార్కింగ్ ఏర్పాట్లు, రద్దీ ప్రాంతాల్లో ట్రాఫిక్ నిర్వహణను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దే అంశాలపై సమావేశంలో సమగ్రంగా చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, షాపింగ్ మాల్స్, వాణిజ్య సముదాయాలు మరియు కమర్షియల్ కాంప్లెక్స్‌లు తప్పనిసరిగా తగిన పార్కింగ్ సదుపాయాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రోడ్లపై వ్యాపారం నిర్వహిస్తున్న చిరు వ్యాపారులకు ఇబ్బంది కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తూనే ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరాయం కలగకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. సర్వేపల్లి రోడ్డును ప్రత్యామ్నాయ ట్రాఫిక్ మళ్లింపు మార్గంగా వినియోగించే అవకాశాలను పరిశీలించాలని, ముఖ్యంగా చిన్న వాహనాలను ఆ మార్గం వైపు మళ్లించడం ద్వారా నగర ప్రధాన రహదారులపై ట్రాఫిక్ ఒత్తిడిని తగ్గించే అవకాశాలపై దృష్టి సారించాలని సూచించారు.

అలాగే కనకమహల్ సెంటర్ నుంచి గాంధీ బొమ్మ వరకు ఉన్న మార్గంలో ట్రాఫిక్‌కు ఆటంకం కలిగించే ఆక్రమణలు, పార్కింగ్ సమస్యలు మరియు ఇతర అవరోధాలపై చట్టపరమైన నిబంధనల మేరకు తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ట్రాఫిక్‌కు సంబంధించిన సమస్యలు, అక్రమ పార్కింగ్, రహదారులపై ఉన్న అవరోధాలపై ప్రజలు తమ సూచనలు, ఫిర్యాదులను నెల్లూరు నగర మున్సిపల్ కార్పొరేషన్ వాట్సాప్ నంబర్ 94940 18118కు పంపవచ్చని తెలిపారు. ట్రాఫిక్ అంతరాయాలు, రోడ్డు ప్రమాదాలు లేదా ఇతర శాంతిభద్రతల సమస్యలకు సంబంధించి వెంటనే 100 లేదా 112కు సమాచారం అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) సౌజన్య, నెల్లూరు నగర మున్సిపల్ కమిషనర్ వై ఓ . నందన్, ఆర్టీసీ రీజనల్ మేనేజర్, ట్రాఫిక్ సీఐతో పాటు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఎన్ జి టి మార్గదర్శకాలు అంశాలపై సమీక్ష

## కమిషనర్ వై ఓ.నందన్



నెల్లూరు( సింధూర దర్శిని) 7 ఆగస్టు నెల్లూరు జిల్లా ; ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరీ సురేష్ కుమార్, కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డాక్టర్ పి. సంపత్ కుమార్ లు వివిధ అంశాలపై శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. నెల్లూరు నగర పాలక సంస్థ కార్యాలయం కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో కమిషనర్ వై.ఓ.నందన్ అధికారులతో కలిసి హాజరయ్యారు. సమావేశంలో తాగునీటి సరఫరాలో సమస్యలు, ఏపీ అర్బన్ డిజిటల్ రిజిస్ట్రీ, అసెట్ మేనేజ్మెంట్ రిజిస్టర్, రెవెన్యూ వసూళ్లు, యానిమల్ భర్త్ కంట్రోల్, ట్రాఫిక్ సిగ్నల్స్, వేస్ట్ మేనేజ్మెంట్ ఎన్.జి.టి మార్గదర్శకాలు తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. వివిధ అంశాల అమలు ప్రక్రియ ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలని ఆదేశాలు జారీ చేశారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కమిషనర్ కార్యాలయ వివిధ విభాగాల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. సి.డి.ఎమ్.ఏ నిర్దేశించిన అంశాలకు అత్యంత ప్రాధాన్యత కల్పించి వేగవంతంగా చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఈ సమావేశంలో నెల్లూరు నగర పాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, ఇంజనీరింగ్ విభాగం ఎస్.ఈ. రహంతు జానీ, ఈ.ఈ. చంద్రయ్య, డి.ఈ.ఈ. ముజాహిద్దీన్, సిటీ ప్లానర్ రఘునాధరావు, ఆరోగ్యశాఖ అధికారి వెటర్నరీ డాక్టర్ మదన్మోహన్, టి.పి.ఆర్.ఓ వాసుబాబు, టి.పి.ఓ సతీష్, రెవెన్యూ అధికారులు సమద్, శ్రీనివాసులు హాజరయ్యారు.

# అంగన్‌వాడీ కార్యకర్తలు ఆయాల సంక్షేమానికి కేంద్రం ప్రాధాన్యం

**వేతనాలపై ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ప్రశ్నలకు కేంద్రం సమాధానం - పదోన్నతులు, బీమా, ఆరోగ్య రక్షణ, పెన్షన్ పథకాలతో సంక్షేమానికి ప్రాధాన్యం**



న్యూఢిల్లీ: అంగన్‌వాడీ సేవల పథకం కింద అంగన్‌వాడీ కార్యకర్తలు , అంగన్‌వాడీ ఆయాలు పొందుతున్న వేతనం, రాష్ట్ర ప్రభుత్వాలు అదనంగా చెల్లిస్తున్న వేతనాల వివరాలు, కేంద్ర--రాష్ట్ర వ్యయ భాగస్వామ్య విధానం, పదవీ విరమణ అనంతర సంక్షేమ చర్యలు, బీమా, పెన్షన్, వేతనాల సకాలంలో చెల్లింపు వంటి అంశాలపై నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి లోక్‌సభలో లిఖితపూర్వకంగా ప్రశ్నలు అడిగారు. ఎంపీ వేమిరెడ్డి ప్రశ్నలకు కేంద్ర మహిళా, శిశు అభివృద్ధి శాఖ సహాయ మంత్రి సావిత్రి ఠాకూర్ శుక్రవారం లిఖితపూర్వకంగా సమాధానం ఇచ్చారు.

### 2018లో కేంద్ర గౌరవ వేతనాల పెంపు

అంగన్‌వాడీ కార్యకర్తలు, అంగన్‌వాడీ ఆయాలు స్వచ్ఛందంగా సేవలందించే గౌరవ ఉద్యోగులని కేంద్ర మంత్రి తెలిపారు. వీరికి చెల్లించే గౌరవ వేతనాన్ని అవసరానికి అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడు పెంచుతూ వస్తోందన్నారు. 2018 అక్టోబర్ 1 నుంచి అంగన్‌వాడీ కార్యకర్తల కేంద్ర గౌరవ వేతనాన్ని నెలకు రూ. 3,000 నుంచి రూ. 4,500కు, అంగన్‌వాడీ ఆయాల గౌరవ వేతనాన్ని రూ. 1,500 నుంచి రూ. 2,250కు పెంచినట్లు వెల్లడించారు. అంతేకాకుండా అంగన్‌వాడీ కార్యకర్తలకు నెలకు రూ. 500, అంగన్‌వాడీ ఆయాలకు రూ. 250 చొప్పున పనితీరు ఆధారిత ప్రోత్సాహకాన్ని కూడా కేంద్ర ప్రభుత్వం అందిస్తున్నట్లు తెలిపారు.

### ఆంధ్రప్రదేశ్‌లో అదనపు గౌరవ వేతనం

కేంద్ర ప్రభుత్వం వెల్లడించిన వివరాల ప్రకారం రాష్ట్ర ప్రభుత్వాలు తమ సొంత నిధులతో కేంద్ర గౌరవ వేతనానికి అదనంగా టాప్-అప్ గౌరవ వేతనాన్ని చెల్లిస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో అంగన్‌వాడీ కార్యకర్తలకు నెలకు రూ. 7,000, అంగన్‌వాడీ ఆయాలకు రూ. 4,750 చొప్పున అదనపు గౌరవ వేతనం చెల్లిస్తున్నట్లు కేంద్ర మంత్రి వెల్లడించారు.

### పదోన్నతులు, సంక్షేమ చర్యలు

మిషన్ సక్షమ్ అంగన్‌వాడీ అండ్ పోషణ్ 2.0 కింద అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం పలు చర్యలు చేపట్టినట్లు కేంద్ర మంత్రి తెలిపారు. అంగన్‌వాడీ ఆయాలకు పదోన్నతి అవకాశాలు కల్పిస్తూ అంగన్‌వాడీ కార్యకర్తల పోస్టుల్లో 50 శాతం, అంగన్‌వాడీ కార్యకర్తలకు సూపర్‌వైజర్ పోస్టుల్లో 50 శాతం పదోన్నతి ద్వారా భర్తీ చేసే విధానాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. అలాగే సంవత్సరానికి 20 రోజుల వార్షిక సెలవులు, 180 రోజుల చెల్లింపు ప్రసూతి సెలవు, గర్భస్రావం జరిగిన సందర్భంలో 45 రోజుల చెల్లింపు సెలవులు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు.

పెన్షన్, బీమా, ఆరోగ్య రక్షణ

అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు ప్రధాన్ మంత్రి శ్రమ్ యోగి మాంధన్ పెన్షన్ పథకంలో చేరేలా రాష్ట్రాలను ప్రోత్సహిస్తున్నట్లు కేంద్ర మంత్రి తెలిపారు. అదేవిధంగా ప్రధాన్ మంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన కింద రూ. 2 లక్షల జీవిత బీమా, ప్రధాన్ మంత్రి సురక్షా బీమా యోజన కింద ప్రమాద బీమా సదుపాయాలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. 2024--25 ఆర్థిక సంవత్సరం నుంచి ఆయుష్మాన్ భారత్ ప్రధాన్ మంత్రి జన ఆరోగ్య యోజన కింద అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలందరికీ సంవత్సరానికి రూ. 5 లక్షల వరకు ఆరోగ్య బీమా సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఏడాది ఏప్రిల్ 30ను పదవీ విరమణ తేదీగా అమలు చేయాలని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు సూచించినట్లు వెల్లడించారు.

### సకాలంలో గౌరవ వేతనాల చెల్లింపునకు చర్యలు

మిషన్ సక్షమ్ అంగన్‌వాడీ అండ్ పోషణ్ 2.0 పథకాన్ని కేంద్ర ప్రాయోజిత పథకంగా అమలు చేస్తున్నట్లు కేంద్ర మంత్రి తెలిపారు. విధాన రూపకల్పన, ప్రణాళిక బాధ్యతలు కేంద్ర ప్రభుత్వానివని, రోజువారీ అమలు బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాలదేనని పేర్కొన్నారు. గౌరవ వేతనాలు, ప్రోత్సాహకాలు సకాలంలో చెల్లింపునకు పారదర్శకత, జవాబుదారీతనం పెంచే ఉద్దేశంతో వ్యవస్థ ద్వారా 'జస్ట్ ఇన్ టైమ్' విధానంలో నిధులు విడుదల చేస్తున్నట్లు తెలిపారు. అలాగే అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలతో నిరంతరం వీడియో కాన్ఫరెన్సులు నిర్వహిస్తూ నిధుల వినియోగాన్ని సమీక్షిస్తున్నట్లు వెల్లడించారు.

# చేనేత కార్మికుల సంక్షేమమే ఎన్డీఏ ప్రభుత్వ లక్ష్యం:ఎమ్మెల్సీ



**జిల్లాలోని 4,793 మంది చేనేత కార్మికులకు "నేతన్న సేవలో" పథకం కింద ఒక్కొక్కరికి రూ.25 వేల ఆర్థిక సాయం**

నెల్లూరు( సింధూర దర్శిని) 7 ఆగస్టు నెల్లూరు జిల్లా ; చేనేత కార్మికుల సంక్షేమం, అభివృద్ధికి ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని శాసన మండలి సభ్యులు బీద రవిచంద్ర అన్నారు. 12వ జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం నెల్లూరు కలెక్టరేట్లోని తిక్కన భవన్‌లో నిర్వహించిన "నేతన్న సేవలో" కార్యక్రమంలో శాసన మండలి సభ్యులు బీద రవిచంద్ర, నెల్లూరు రూరల్ శాసనసభ్యులు కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. బాపట్లలో నిర్వహించిన రాష్ట్రస్థాయి కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జిల్లాలోని 4,793 మంది చేనేత కార్మికుల బ్యాంకు ఖాతాల్లో "నేతన్న సేవలో" పథకం కింద ఒక్కొక్కరికి రూ. 25 వేల చొప్పున జమ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ బీద రవిచంద్ర మాట్లాడుతూ, భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 2017 ఆగస్టు 7న చెన్నైలో జరిగిన జాతీయ చేనేత సభలో ఆగస్టు 7వ తేదీని జాతీయ చేనేత దినోత్సవంగా ప్రకటించారని, అప్పటి నుంచి రాష్ట్రంలో ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. చేనేత కార్మికులతో తమ ప్రభుత్వానికి విడదీయరాని అనుబంధం ఉందని, వారి సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. నారా లోకేష్ రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన పాదయాత్రలో చేనేతల సమస్యలను తెలుసుకుని, వారి సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. అందులో భాగంగానే ప్రతి చేనేత కుటుంబానికి ఏడాదికి రూ. 25 వేల ఆర్థిక సాయం, ప్రతి నెల ఉచిత విద్యుత్ అందిస్తున్నట్లు చెప్పారు. మంగళగిరిలో ప్రత్యేకంగా చేనేత క్లస్టర్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. చేనేతల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ, ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తూ సుపరిపాలన అందిస్తోందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నాయకత్వంలో అమరావతి నిర్మాణం, పోలవరం ప్రాజెక్టు, పారిశ్రామికాభివృద్ధి కార్యక్రమాలు వేగంగా కొనసాగుతున్నాయని, రూ. 20 వేల కోట్ల పెట్టుబడులతో రాష్ట్రంలో పరిశ్రమలు ఏర్పడి లక్షలాది మందికి ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయని చెప్పారు. ప్రతి చేనేత కుటుంబానికి ఏడాదికి రూ. 25 వేల ఆర్థిక సహాయం అందించడం వారికి ఎంతో ఊరటనిస్తుందని అన్నారు. జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, చేనేత కార్మికుల సమస్యల పరిష్కారానికి జిల్లా యంత్రాంగం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. జిల్లాలో 4,793 మంది లబ్ధిదారులకు "నేతన్న సేవలో" పథకం ద్వారా ఒక్కొక్కరికి రూ. 25 వేల చొప్పున జమ కావడం సంతోషకరమన్నారు. అలాగే జిల్లాలో 3,225 చేనేత కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నట్లు తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి చేనేత రంగ అభివృద్ధికి కృషి చేస్తామని చెప్పారు.

అనంతరం పలువురు చేనేత కార్మికులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బూదాటి రాధయ్య, చేనేత కార్పొరేషన్ డైరెక్టర్ రామస్వామి, చేనేత జౌళి శాఖ అసిస్టెంట్ డైరెక్టర్లు కె. బాలసుబ్రమణ్యం, వరప్రసాద్, జిల్లా నలుమూలల నుంచి విచ్చేసిన చేనేత సంఘాల నాయకులు, చేనేత కార్మికులు పాల్గొన్నారు.

# క్యూఆర్ కోడ్ ఆధారిత స్మార్ట్ మీడియా అక్రిడిటేషన్ సిస్టం ప్రారంభం :ఎస్పీ డాక్టర్ అజిత వెజెండ్ల



నెల్లూరు (సింధూర దర్శిని) 7 ఆగస్టు నెల్లూరు జిల్లా ; జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో మీడియా ప్రతినిధుల గుర్తింపు ప్రక్రియను మరింత పారదర్శకంగా, వేగవంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు క్యూఆర్ కోడ్ ఆధారిత స్మార్ట్ మీడియా అక్రిడిటేషన్ సిస్టమ్ను ప్రవేశపెట్టినట్లు జిల్లా ఎస్పీ డాక్టర్ అజిత వేజెండ్ల తెలిపారు. శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ మాట్లాడుతూ, ప్రజలకు వాస్తవమైన, వేగవంతమైన సమాచారాన్ని చేరవేయడంలో మీడియా కీలక భాగస్వామి అని పేర్కొన్నారు. మీడియా ప్రతినిధుల సూచనల మేరకు డీడీ ఐడపీఆర్, పోలీసు పి ఆర్ ఓ టీమ్, ఎస్ ఏ ఏ ఎస్ టెక్ టీమ్ సహకారంతో ఈ వినూత్న వ్యవస్థను అభివృద్ధి చేసినట్లు తెలిపారు. ఈ విధానంలో అక్రిడిటెడ్ జర్నలిస్టుకు ప్రత్యేక క్యూఆర్ కోడ్ డిజిటల్ పాస్ జారీ చేయబడుతుందని, పోలీసు అధికారులు ఆ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయడం ద్వారా క్షణాల్లో సంబంధిత మీడియా ప్రతినిధి వివరాలను ధృవీకరించవచ్చని వివరించారు. జర్నలిస్టుల వివరాలు సురక్షిత డిజిటల్ డేటాబేస్‌లో భద్రపరచబడతాయని, దీనివల్ల నకిలీ మీడియా పాస్‌ల వినియోగాన్ని అరికట్టడంతో పాటు వ్యవస్థలో పారదర్శకత మరింత పెరుగుతుందని చెప్పారు. వివిఐపి , వీఐపీ బందోబస్తు, నేర సంఘటనలు, అత్యవసర పరిస్థితుల్లో మీడియా ప్రతినిధుల వివరాలను త్వరితగతిన ధృవీకరించేందుకు ప్రత్యేక మీడియా పోర్టల్ ద్వారా అధికారులకు రియల్‌టైమ్ సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. ఈ వ్యవస్థ జర్నలిస్టులకు వారి విధి నిర్వహణను మరింత సులభతరం చేయడమే ప్రధాన ఉద్దేశమని ఎస్పీ స్పష్టం చేశారు. పోలీసు--మీడియా మధ్య పరస్పర విశ్వాసం, పారదర్శకత, బాధ్యతాయుత వ్యవహారం, వృత్తిపరమైన సహకారాన్ని మరింత బలోపేతం చేయడమే ఈ కార్యక్రమం లక్ష్యమని జిల్లా ఎస్పీ పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ని కొంత మంది మీడియా మిత్రులు ఈ క్యూఆర్ కోడ్ రిజిస్ట్రేషన్ ప్రోగ్రామ్ ను 3 వ రోజూ కూడా ఎక్స్టెటెండ్ చేయగలరు అని అభ్యర్థించగా, సోమవారం కూడా ఈ ప్రోగ్రామ్ ఉమేష్ చంద్ర కాన్ఫరెన్స్ హాల్ నందు నిర్వహించాలి అని అధికారులకు సూచనలు ఇచ్చారు.

## చేనేత వస్త్రాలను కొనుగోలు చేసే వారిని ప్రోత్సహించాలి

**ఆర్డీవో అరుణకుమారి**



గూడూరు (సింధూర దర్శిని) 7 ఆగస్టు నెల్లూరు జిల్లా ; చేనేత వస్త్రాలు మన సంస్కృతి సాంప్రదాయాన్ని తెలియజేస్తాయని నేటి తరంవారు చేనేత వస్త్రాలను కొనుగోలు చేసి వారిని ప్రోత్సహించాలని చేనేత వస్త్రాలు నాణ్యతగా బాగుంటాయని గూడూరు ఆర్డీవో అరుణకుమారి వెల్లడించారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా గూడూరు పట్టణంలోని నారాయణ ఇంజనీరింగ్ కళాశాలలో విజయ వాహిని చారిటబుల్ ఫౌండేషన్ మరియు టాటా ట్రస్ట్ ఆధ్వర్యంలో చేనేత రంగంలో జాతీయస్థాయిలో రాష్ట్రపతి ప్రధానమంత్రి చేతుల మీదుగా అవార్డులు అందుకున్న వారికి సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆర్డిఓ అరుణకుమారి వారిని ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. చేనేత వస్త్రాలను పరిశీలించారు. ఆర్డీవో అరుణకుమారి మాట్లాడుతూ చేనేత వస్త్రాలు నాణ్యతగా చేతితో ఎంతో అందంగా తయారు చేస్తారని, ఎంతో నాణ్యతగా ఉంటాయని అన్నారు. బ్రిటిష్ కాలంలోనే స్వదేశీ వస్త్రాలనే వినియోగించాలని పోరాటం జరిగిందని గుర్తు చేశారు. చేనేత కార్మికులు మంచి దుస్తులను తయారు చేసి మన ప్రాంతం నుండి జాతీయస్థాయికి అవార్డుకు ఎంపిక కావడంతో సంతోషంగా ఉందని పేర్కొన్నారు. నేటితరం వారు చేనేత వస్త్రాలను కొనుగోలు చేయాలని సూచించారు. ప్రోగ్రాం కోఆర్డినేటర్ మస్తాన్ మాట్లాడుతూ టాటా ట్రస్ట్ కొన్ని సంవత్సరాలుగా చేనేత కార్మికుల తయారు చేస్తున్న వస్త్రాలను మార్కెటింగ్ ఎలా చేయాలి సోషల్ మీడియా ఎలా వినియోగించుకోవాలో కార్మికులకు అవగాహన కల్పిస్తూ వారు ఆర్థికంగా ఎదిగేందుకు పనిచేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ ,విశ్వక్సేనారెడ్డి హెచ్ ఓ డి ఈశ్వర్ రెడ్డి,టీం మెంబర్స్ వంశీ, సందీప వర్దేశ్, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## డీఎస్సీ అక్రమాలపై విచారణ జరిపించాలి

**సమన్వయకర్త బూదూరు గురవయ్య**




గూడూరు( సింధూరదర్శిని) 7 ఆగస్టు నెల్లూరుజిల్లా; గూడూరు పట్టణంలోని టవర్ క్లాక్ సెంటర్ వద్ద వైసీపీ నియోజకవర్గ ఇన్చార్జి గురవయ్య ఆధ్వర్యంలో రెండోరోజు రిలేదీక్షలు కొనసాగాయి. ఈ సందర్భంగా గురవయ్య మాట్లాడుతూ డీఎస్సీలో జరిగిన అక్రమాలతో అర్హులైన అనేకమందికి ఉద్యోగాలు రాలేదని కూటమి ప్రభుత్వం ఇప్పటికైనా దీనిపై సిబిఐ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఈ దీక్షలో పలువురు వైసీపీ నాయకులు దేగపూడి కృష్ణారెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, మనుబోలు కృష్ణయ్య, అట్టల శ్రీనివాసులు రెడ్డి, జనార్దన్ రెడ్డి , వసంత్ కుమార్ రెడ్డి అనుబంధ సంఘ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రభుత్వం చేపడుతున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



నెల్లూరు (సింధూర దర్శిని) 7 ఆగస్టు నెల్లూరు జిల్లా; పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ఆధ్వర్యంలో స్థానిక 53 వ డివిజన్ గాంధీ గిరిజన కాలనీ ప్రాంతంలో "నిర్మాణ్ స్లమ్ సమాఖ్య" సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా నెల్లూరు నగరపాలక సంస్థ మేయర్ దేవరకొండ సుజాత అశోక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ మహిళాభ్యున్నతి కోసం రాష్ట ప్రభుత్వం చేపడుతున్న వివిధ పథకాలను వివరించి, వాటిని సద్వినియోగం చేసుకోవాలని మహిళలకు సూచించారు. మెప్మా పి.డి కిరణ్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

## ఎలక్ట్రికల్ వాహనం విరాళం

**ఆలయ ఈవో పెంచల కిషోర్ , ఆలయ చైర్మన్ మణి**



కాణిపాకం(సింధూరదర్శిని) 7ఆగస్టు చిత్తూరు జిల్లా; కాణిపాకం స్వయంభు శ్రీ కాణిపాక వరసిద్ధి వినాయక స్వామివారి దేవస్థానమునకు లకేజీ మూడు చక్రాల ఎలక్ట్రికల్ వాహనం విరాళం సుమారు విలువ 1,75,000/- రూపాయలు, దాత-బి.ఎం.ఆర్ కంపెనీకి చెందిన మోహన్ రెడ్డి, యాదమారి వాస్తవ్యులు ఆలయముకు అందజేశారు, ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ మణి నాయుడు, ఈ.వో పెంచల కిషోర్, ఆలయ ఏఈఓ రవీంద్రబాబు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# షెడ్యూల్డ్ కులాల సంక్షేమం హక్కుల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలి

ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి అందాలి

ఎస్.సి. బ్యాక్ లాగ్ పోస్టులను భర్తీకి చర్యలు తీసుకోవాలి - జాతీయ షెడ్యూల్డ్ కులాల కమిషన్ ఛైర్మన్ కిషోర్ మక్వానా

తిరుపతి జిల్లా సాంఘిక సంక్షేమ శాఖపై సమీక్ష నిర్వహించిన జాతీయ షెడ్యూల్డ్ కులాల కమిషన్ ఛైర్మన్ కిషోర్ మక్వానా



తిరుపతి (సింధూర దర్శిని) 7 ఆగస్టు తిరుపతి జిల్లా ; తిరుపతి జిల్లాలో షెడ్యూల్డ్ కులాల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను, సామాజిక, ఆర్థిక అభివృద్ధి, విద్య, ఉపాధి, వసతి సౌకర్యాలు, హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని జాతీయ షెడ్యూల్డ్ కులాల కమిషన్ ఛైర్మన్ కిషోర్ మక్వానా తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం స్థానిక శ్రీ పద్మావతి అతిథి గృహంలో భారత జాతీయ షెడ్యూల్డ్ కులాల కమిషన్ ఛైర్మన్ కిషోర్ మక్వానా, తిరుపతి ఎం.పి. గురుమూర్తి , జాతీయ షెడ్యూల్డ్ కులాల కమిషన్ సెక్రటరీ శ్రీనివాస్, డైరెక్టర్ సునీల్ కుమార్ బాబు, రీసర్చ్ అధికారి వర ప్రసాద్, జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్, జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బారాయుడు లతో కలసి జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ షెడ్యూల్డ్ కులాల కమిషన్ ఛైర్మన్ కిషోర్ మక్వానా మాట్లాడుతూ జిల్లాలో షెడ్యూల్డ్ కులాల సంక్షేమం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను, సామాజిక, ఆర్థిక అభివృద్ధి, విద్య, ఉపాధి, వసతి సౌకర్యాలు, హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలన్నారు. అర్హులైన ప్రతి ఎస్సీ కుటుంబానికి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల ప్రయోజనాలు సకాలంలో చేరేలా క్షేత్రస్థాయిలో అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకత పాటిస్తూ, అర్హత ఉన్న ఏ ఒక్కరూ ప్రభుత్వ ప్రయోజనాలకు దూరం కాకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులకు మెరుగైన వాతావరణం కల్పించడంతో పాటు, వారి విద్యా ప్రగతిపై ప్రత్యేక దృష్టి సారించాలని సంబంధిత అధికారులకు సూచించారు. వసతి గృహాల్లో అవసరమైన మరమ్మత్తులు, మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. జిల్లాలో ఖాళీగా ఉన్న ఎస్.సి. బ్యాక్ లాగ్ పోస్టులను భర్తీ చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్సీ విద్యార్థుల విద్యాభివృద్ధికి ప్రభుత్వం అందిస్తున్న విద్యా సహాయం, స్కాలర్‌షిప్‌లు, సంక్షేమ వసతి గృహాల నిర్వహణ, భవనాల మౌలిక వసతులు, తాగునీరు, పారిశుధ్యం, విద్యార్థులకు నాణ్యమైన భోజనం తదితర అంశాల అమలు పై సమీక్షించారు. అలాగే షెడ్యూల్డ్ కులాల కుటుంబాల ఆర్థిక స్థితిగతులను మెరుగుపరిచేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న స్వయం ఉపాధి, జీవనోపాధి, నైపుణ్యాభివృద్ధి, ఆర్థిక సహాయం తదితర కార్యక్రమాల అమలుపై సమీక్షించారు. యువతకు నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు, అర్హులైన లబ్ధిదారులను గుర్తించి సంబంధిత పథకాల ద్వారా ఆర్థికంగా బలోపేతం చేయాలని అధికారులకు సూచించారు. షెడ్యూల్డ్ కులాలపై జరుగుతున్న దాడులు, వివక్ష, అట్రాసిటీ కేసుల నమోదు, దర్యాప్తు, బాధితులకు పరిహారం, న్యాయ సహాయం తదితర అంశాలపై సమీక్షిస్తూ బాధితులకు చట్టపరమైన రక్షణ కల్పించడంతో పాటు, ప్రభుత్వం ద్వారా అందాల్సిన పరిహారం, ఇతర సహాయాలను సకాలంలో అందేలా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఎస్సీ వర్గాలపై వివక్షకు తావులేకుండా రాజ్యాంగం కల్పించిన హక్కులు, రక్షణలను సమర్థవంతంగా అమలు చేయాలని తెలిపారు. షెడ్యూల్డ్ కులాల సంక్షేమానికి సంబంధించిన కార్యక్రమాల అమలులో సాంఘిక సంక్షేమ శాఖతో పాటు రెవెన్యూ, పోలీసు, విద్య, వైద్య ఆరోగ్యం, గ్రామీణాభివృద్ధి, ఉపాధి తదితర శాఖలు సమన్వయంతో పనిచేయాలని సమావేశంలో సూచించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ఎస్సీ వర్గాల ప్రజలకు ప్రభుత్వ పథకాలపై పూర్తి అవగాహన కల్పించి, అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. తిరుపతి జిల్లా యంత్రాంగం తరపున జిల్లాలో షెడ్యూల్డ్ కులాల సంక్షేమం కోసం అమలు చేస్తున్న కార్యక్రమాలు, పథకాల పురోగతి, విద్యార్థుల సంక్షేమం, వసతి గృహాల పరిస్థితి, ఆర్థిక సాధికారత కార్యక్రమాలు, ఎస్సీ అట్రాసిటీ కేసుల పరిష్కారం తదితర అంశాలకు సంబంధించిన జిల్లా సమీక్షా నివేదికపై జాతీయ షెడ్యూల్డ్ కులాల కమిషన్ ఛైర్మన్ కిషోర్ మక్వానాకు తెలిపారు. ఈ సమావేశంలో సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు, రెవెన్యూ, పోలీసు, విద్య, సంక్షేమం, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## జనసేన వినతులపై స్పందించిన ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్

ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులకు ఫోన్‌లో ఆదేశాలు



గూడూరు (సింధూరదర్శిని) 7 ఆగస్టు నెల్లూరు జిల్లా;గూడూరు నియోజకవర్గ పరిధిలోని పలు ప్రజా సమస్యలను జనసేన పార్టీ నాయకులు శుక్రవారం కూటమి ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లి, తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని గూడూరు జనసేన పార్టీ నాయకులు తీగల చంద్రశేఖర రావు మరియు కె.మోహన్ కోరారు. జనసేన పార్టీ వినతులపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి వెంటనే చర్యలు చేపట్టాలని సూచించారు.గూడూరు పరిధిలోని పలు దేవస్థానాల్లో ఆర్థిక నిర్వహణకు సంబంధించి అవకతవకలు జరిగినట్లు వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో, రికార్డుల్లో నమోదైన ఆర్థిక లావాదేవీలు, ఆదాయ--వ్యయ వివరాలు, నిధుల వినియోగం పై సమగ్ర, స్వతంత్ర విచారణ చేపట్టాలని జనసేన పార్టీ కోరింది. అవకతవకలు నిర్ధారణ అయితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేసింది. అలాగే గూడూరు మండలంలోని వ్యవసాయ పొలాలకు అనుసంధానంగా అవసరమైన ప్రాంతాల్లో గ్రావెల్ రోడ్లు మంజూరు చేసి నిర్మించాలని, రైతులు తమ పొలాలకు వెళ్లేందుకు, వ్యవసాయ ఉత్పత్తులను రవాణా చేసేందుకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.వాకాడు మండలంలోని కొండాపురం పంచాయతీలో సరైన డ్రైనేజీ కాలువలు లేక మురుగునీరు నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ప్రజా ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని శాశ్వత డ్రైనేజీ కాలువ నిర్మాణం చేపట్టి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు.ఇదే సందర్భంగా గూడూరు పట్టణం, చిల్లకూరు మండలంలో తాగునీటి సరఫరాలో తీవ్ర ఇబ్బందులు ఉన్నాయని, పలు ప్రాంతాల్లో సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారని జనసేన పార్టీ నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని, దెబ్బతిన్న డ్రైనేజీ కాలువలను మరమ్మతు చేసి, అవసరమైన చోట్ల కొత్తగా నిర్మించాలని కోరారు. వీటిపై కూడా ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ సానుకూలంగా స్పందించి, సంబంధిత అధికారులను ఆదేశించి వెంటనే పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో గూడూరు ఏఎంసీ డైరెక్టర్ కృష్ణమ్మ, జనసేన పార్టీ నాయకులు నవీన్, సాయికిరణ్, మునిశేఖర్, వెంకటేశ్వర్లు, కార్తీక్, నితీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పొన్నమండ లక్ష్మణస్వామి వర్మ సేవలు చిరస్మరణీయం

జిల్లా ఎస్పీ డా. అజిత వెజెండ్ల



నెల్లూరు( సింధూరదర్శిని)7 ఆగస్టు నెల్లూరు జిల్లా; ప్రముఖ సామాజికవేత్త, ప్రజాసేవకుడు కీర్తిశేషులు శ్రీ పొన్నమండ లక్ష్మణస్వామి వర్మ జయంతి సందర్భంగా నెల్లూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి జిల్లా ఎస్పీ డా.అజిత వెజెండ్ల పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, లక్ష్మణస్వామి వర్మ సమాజ శ్రేయస్సు, ప్రజా సంక్షేమం కోసం విశేష సేవలు అందించారని తెలిపారు. ఆయన తన జన్మస్థలం కోరంగి ప్రాంతంలో పేదలకోసం సుమారు 120రకాల ఆయుర్వేద ఔషధాలు తయారు చేసి, దేశంతో పాటు ఇండోనేషియా, జావా, సుమిత్ర, ఆఫ్రికా దేశాలకు నౌకా వాణిజ్యం ద్వారా ఎగుమతి చేశారని పేర్కొన్నారు. అలాగే పేదలు, వెనుకబడిన వర్గాల అభ్యున్నతి, విద్యార్థులకు విద్యా అవకాశాలు, నిరుపేదలకు ఆర్థిక సహాయం, రైతులు, వ్యవసాయ కార్మికుల సంక్షేమం కోసం జీవితాంతం కృషి చేశారని కొనియాడారు.ఈ సందర్భంగా పలువురు అధికారులు మాట్లాడుతూ, లక్ష్మణస్వామివర్మ సేవలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని, ఆయన ఆశయాలను అనుసరించ డమే నిజమైన నివాళి అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ, సౌజన్య, ఏఆర్ డీఎస్పీ చంద్రమోహన్, దాశరథ రామారావు, శ్రీనివాసరెడ్డి, ఆర్ఐ హోం గార్డ్స్ పాల్‌రాజు తదితర అధికారులు, సిబ్బంది పాల్గొని నివాళులర్పించారు.

## సుబ్రహ్మణ్య స్వామికి వైభవంగా గ్రామోత్సవం

బుచ్చిరెడ్డిపాలెం ( సింధూర దర్శిని) 7 ఆగస్టు నెల్లూరు జిల్లా ; జొన్నవాడ క్షేత్రములో ఆడికృత్తిక పర్వదినాన్ని పురస్కరించుకొని శ్రీ వల్లి దేవసేన సమేత శ్రీసుబ్రహ్మణ్య స్వామివారికి గ్రామోత్సవం అత్యంత వైభవోపేతంగా నిర్వహించబడింది.ఈ సందర్భంగా స్వామివారిని పుష్పాలతో అద్భుతంగా అలంకరించి, ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజలు, అర్చనలు, హారతులు నిర్వహించారు. అనంతరం భక్తజనుల మధ్య స్వామివారి గ్రామోత్సవం ఘనంగా సాగింది.వేద మంత్రోచ్ఛారణల నడుమ, మంగళ వాయిద్యాల మధ్య స్వామి వారు గ్రామ వీధులలో విహరించగా, భక్తులు పాల్గొని స్వామి వారికి హారతులు సమర్పించి దర్శించుకొని దైవానుగ్రహం పొందారు. ఈ కార్యక్రమంనకు నెల్లూరు వాస్తవ్యులు దేగపూడి మల్లికార్జున దంపతులు రాజోలు వాస్తవ్యులు సిహెచ్.వెంకటరెడ్డి దంపతులుఉభయకర్తలుగా వ్యవహరించారు.



## దళితవాడలలో స్మశానాలకి దారి ఏర్పాట్లు చేయండి

కెవిపిఎస్ వ్యవసాయ కార్మిక సంఘం, కౌలు రైతు సంఘం, సిఐటియు నాయకులు



గూడూరు( సింధూర దర్శిని) 7 ఆగస్టు నెల్లూరు జిల్లా; సామాజిక శంఖారావం కార్యక్రమంలో భాగంగా గూడూరు లోని ఎమ్మార్వో కార్యాలయం ముందు శుక్రవారం గూడూరు పట్టణం మరియు గూడూరు రూరల్ పరిధిలో గ్రామాల ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై సర్వే నిర్వహించడం జరిగిందని,వాటిని వెంటనే పరిష్కరించాలని, కె.వి.పి.ఎస్, వ్యవసాయ కార్మిక సంఘం, కౌలు రైతు సంఘం,సి.ఐ.టి.యు నాయకులు ధర్నా నిర్వహించడం జరిగింది. అనంతరం నాయకులు మాట్లాడుతూ గూడూరు రూరల్ మండలం పరిధిలోని కాంద్ర, వెంకటేసుపల్లి,తిమ్మసముద్రం, వేములపాలెం, విందూరు, కొండాగుంట, వెడిచెర్ల, చెన్నూరు లోని జగనన్న కాలని, శెట్టి గారి తోట, మరియు పైన తెలియజేసిన గ్రామాల లోని దళితవాడలలో స్మశానాలకి దారి ఏర్పాట్లు, మరికొన్ని గ్రామాల్లో అసలే స్మశానాలు లేకపోవడం మరి కొంతమంది స్మశానాలకు పోవు దారులను ఆక్రమించుకోవడం వాటికి ప్రహరీ గోడ లేకపోవడం దళితులకు కర్మకాండలు జరుపుకునేందుకు భవనాన్ని నిర్మించాలని, పక్కా ఇల్లు, ఇళ్ల స్థలాలు, డ్రైనేజీ,వీధిలైట్లు హరిజనవాడలలో రోడ్లు ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు.అలాగే పడమర గూడూరు జక్కా వెంకయ్య శ్రామిక నగర్ లోని పబ్లిక్ మురికి కాలువకు అడ్డంగా కట్టిన గోడను తొలగించాలని, అలాగే కాలనీకి పోయే దారిలో ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్ ఫార్మర్ ను తొలగించాలని,గూడూరు పట్టణంలో గూడూరు ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ ని,అభివృద్ధి చేసి ప్రజలకు అన్ని విధాలా అందుబాటులోకి తేవాలని, గూడూరు ఒకటో పట్టణం నుండి రెండవ పట్టణం నకు కలుపు "ఫ్లై ఓవర్ బ్రిడ్జి" ఎంతోకాలంగా ఆగి ఉంది. వెంటనే నిర్మాణం పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని. గూడూరు ఆర్టీసీ బస్టాండ్ నుండి ప్రజలు ప్రయోజనార్థం తిరుమలకు బస్సు సౌకర్యాలు కల్పించాలని, అలాగే బస్టాండ్ లో రాత్రి వేళల్లో కరెంటు సదుపాయం కల్పించాలి, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ భవనము డి.ఎన్.ఆర్ కమ్యూనిటీ హాల్ పక్కన శంకుస్థాపన చేసి ఉన్నారు దానిని వెంటనే పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం గూడూరు ఎమ్మార్వో ఆర్.వి.ప్రసాద్ కి వినతి పత్రం సమర్పించడం జరిగింది. ఆయన వెంటనే స్పందించి స్మశానాల ఆక్రమణ పరిశీలించి, సమస్యలు వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇవ్వడం జరిగింది.

ఈ కార్యక్రమంలో కె.వి.పి.ఎస్ అధ్యక్ష, కార్యదర్శులు అడపాల ప్రసాద్, ఎంబేటి చంద్రయ్య, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు బి.నారాయణ, గోవింద్, కౌలు రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు జోగి.శివకుమార్,సి.ఐ.టి.యు గూడూరు పట్టణ అధ్యక్ష,కార్యదర్శులు పామంజి మణి, బి.వి.రమణయ్య, సుకన్య, సిద్దమ్మ,గుర్రం రమణయ్య, సి.హెచ్.రమేష్, ఎస్.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ బాల సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో వైభవంగా ఆధ్యాత్మిక కార్యక్రమాలు



రేణిగుంట ( సింధూర దర్శిని): రేణిగుంట మండలం గాజులమండ్యం గ్రామంలో వేంచేసియున్న శ్రీ బాల సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఆడి కృతిక మహోత్సవాలు అత్యంత భక్తిశ్రద్ధలతో, వైభవంగా జరిగాయి. పండుగను పురస్కరించుకుని ఆలయ ప్రాంగణాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలు, సుగంధ పుష్పాలతో నయన మనోహరంగా అలంకరించారు. ఉదయం నుంచే వేదపండితుల మంత్రోచ్చారణలు, మంగళ వాయిద్యాల నడుమ స్వామివారికి పాలు, పెరుగు, తేనె, పన్నీరు తదితర ద్రవ్యాలతో ప్రత్యేక అభిషే కాలు, అర్చనలు, శాంతి హోమాలు నిర్వహించారు. ఈ వేడుకల్లో గాజుల మండ్యంతో పాటు పరిసర గ్రామాల నుంచి భక్తులు విపరీతంగా తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని మొక్కుబడులు తీర్చుకున్నారు. మహా మంగళహారతి అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు, విస్తృత స్థాయిలో అన్నప్రసాద వితరణ చేపట్టారు. కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన ఆలయ అర్చకులు, నిర్వహణ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, యువకులకు ఆలయ నిర్వాహకులు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

# యూరప్‌లో దశాబ్దాల తర్వాత ఖగోళ వింత.. పగలే రాత్రిగా మారే అద్భుతం.. ఎప్పుడంటే?

2026 ఆగస్టు 12న ఏర్పడనున్న సంపూర్ణ సూర్యగ్రహణం

యూరప్‌లో దశాబ్దాల తర్వాత కనువిందు చేయనున్న ఖగోళ దృశ్యం

స్పెయిన్, ఐస్‌లాండ్‌లో పగలే రాత్రిగా మారనున్న వాతావరణం

గరిష్ఠంగా 2 నిమిషాల 18 సెకన్ల పాటు కొనసాగనున్న సంపూర్ణ గ్రహణం

గ్రహణ వీక్షణకు ప్రత్యేక కళ్లద్దాలు తప్పనిసరని శాస్త్రవేత్తల హెచ్చరిక



ప్రపంచవ్యాప్తంగా ఖగోళ ప్రియులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న సంపూర్ణ సూర్యగ్రహణం 2026 ఆగస్టు 12న ఏర్పడనుంది. ఈ అద్భుత దృశ్యం యూరప్ ప్రధాన భూభాగంపై దశాబ్దాల తర్వాత కనువిందు చేయనుండటం విశేషం. ఈ గ్రహణం సమయంలో చంద్రుడు సూర్యుడిని పూర్తిగా కప్పివేయడంతో, నిర్దిష్ట ప్రాంతాల్లో కొద్ది నిమిషాల పాటు పగలే రాత్రిని తలపించేలా వాతావరణం మారిపోతుంది.

### గ్రహణ మార్గం ఎక్కడెక్కడంటే?

ఈ సంపూర్ణ సూర్యగ్రహణ మార్గం గ్రీష్మ శీత ఋతువుల(ఎ) రష్యాలోని ఉత్తర ప్రాంతంలో ప్రారంభమై, ఆర్కిటిక్, గ్రీన్‌లాండ్, ఐస్‌లాండ్‌లోని పశ్చిమ భాగం మీదుగా ప్రయాణిస్తుంది. అనంతరం స్పెయిన్‌లోని ఉత్తర, తూర్పు ప్రాంతాలు, పోర్చుగల్‌లోని ఈశాన్య భాగంలోకి ప్రవేశిస్తుంది. దీంతో స్పెయిన్‌లోని బిల్బావో, జరగోజా, వాలెన్సియా, పాల్మా డి మల్లోర్కా వంటి నగరాలతో పాటు ఐస్‌లాండ్‌లోని కొన్ని ప్రాంతాల్లో పగటిపూట పూర్తి చీకట్లు అలుముకుంటాయి. సంపూర్ణ గ్రహణం గరిష్ఠంగా 2 నిమిషాల 18 సెకన్ల పాటు కొనసాగుతుందని అంచనా. స్పెయిన్‌లో సూర్యాస్తమయానికి ముందు సాయంత్రం వేళ ఈ గ్రహణం ఏర్పడుతుండగా, ఐస్‌లాండ్‌లో మాత్రం సూర్యుడు ఆకాశంలో ఎత్తులో ఉన్నప్పుడే కనిపిస్తుంది.

### పాక్షిక గ్రహణం.. శాస్త్రీయ పరిశోధనలు

సంపూర్ణ గ్రహణ మార్గంలో లేని ప్రాంతాల్లో పాక్షిక సూర్యగ్రహణం కనిపిస్తుంది. యూరప్‌లోని యూకే, ఫ్రాన్స్, జర్మనీ, స్కాండినేవియా దేశాలతో పాటు ఉత్తర అమెరికాలోని కొన్ని భాగాలు, వాయువ్య ఆఫ్రికాలో పాక్షిక గ్రహణాన్ని వీక్షించవచ్చు. ఈ ప్రాంతాల్లో చంద్రుడు సూర్యుడిని పాక్షికంగా కప్పివేస్తాడు. గ్రహణం సమయంలో సూర్యుడి బాహ్య వాతావరణమైన 'కరోనా'పై అధ్యయనం చేసేందుకు శాస్త్రవేత్తలు సన్నాహాలు చేస్తున్నారు. ఇదే సమయంలో పెర్సీడ్ ఉల్కాపాతం కూడా గరిష్ఠ స్థాయికి చేరనుండటంతో ఆకాశంలో అద్భుత దృశ్యాలు ఆవిష్కృతం కానున్నాయి.

### భద్రత చాలా ముఖ్యం

సూర్యగ్రహణాన్ని నేరుగా కంటితో చూడటం అత్యంత ప్రమాదకరం. పాక్షిక గ్రహణం సమయంలో తప్పనిసరిగా ఐఎస్ఓ-సర్టిఫైడ్ ఎక్లిప్స్ గ్లాసెస్ లేదా ప్రత్యేక ఫిల్టర్లు ఉపయోగించాలి. కేవలం సంపూర్ణ గ్రహణ మార్గంలో ఉన్నవారు, సూర్యుడు పూర్తిగా కప్పబడిన ఆ కొద్ది నిమిషాలు మాత్రమే ఎలాంటి రక్షణ లేకుండా గ్రహణాన్ని వీక్షించవచ్చని శాస్త్రవేత్తలు స్పష్టం చేశారు. మిగతా సమయాల్లో నేరుగా చూడటం వల్ల కంటి చూపు శాశ్వతంగా దెబ్బతినే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు.



# కొత్త ఇన్నింగ్స్ మొదలుపెట్టిన అజింక్యా రహానే

యూరోపియన్ టీ20 లీగ్‌లో ఆడనున్న అజింక్యా రహానే

అమ్‌స్టర్‌డామ్ ఫ్లేమ్స్ జట్టుకు మార్క్యూ ప్లేయర్‌గా ఒప్పందం

అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన వెంటనే ఈ ప్రకటన

ఆగస్టు 26 నుంచి ప్రారంభం కానున్న తొలి ఎడిషన్ ఈటీపీఎల్

యూరప్‌లో క్రికెట్ అభివృద్ధికి ఇది కీలక ముందడుగు

భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ అజింక్యా రహానే తన కెరీర్‌లో కొత్త అధ్యాయాన్ని ప్రారంభించాడు. అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన వెంటనే, యూరోపియన్ టీ20 ప్రీమియర్ లీగ్ (ఈటీపీఎల్)లో అడుగుపెట్టాడు. ఈ లీగ్ తొలి ఎడిషన్ కోసం అమ్‌స్టర్‌డామ్ ఫ్లేమ్స్ ఫ్రాంచైజీకి కీలక ఆటగాడిగా రహానే సంతకం చేశాడు. ఈ విషయాన్ని ఫ్రాంచైజీ యాజమాన్యం నేడు అధికారికంగా వెల్లడించింది. ఐసీసీ ఆమోదం పొందిన యూరప్‌లోని మొట్టమొదటి టీ20 లీగ్ ఇదే కావడం విశేషం. ఈ లీగ్ తొలి సీజన్ ఈ నెల 26 నుంచి సెప్టెంబర్ 20 వరకు జరగనుంది. ఇందులో గ్లాస్గో, అమ్‌స్టర్‌డామ్, ఎడిన్‌బర్గ్, డబ్లిన్, బెల్ఫాస్ట్, రోటర్‌డామ్ నగరాలకు చెందిన ఆరు ఫ్రాంచైజీలు పోటీ పడనున్నాయి. భారత్ తరఫున 85 టెస్టులు, 90 వన్డేలు, 20 టీ20 మ్యాచ్‌లు ఆడిన రహానేకు అపారమైన అనుభవం ఉంది. ఐపీఎల్‌లో 212 మ్యాచ్‌లు ఆడి, ఇటీవలి సీజన్లలో కోల్‌కతా నైట్ రైడర్స్‌కు నాయకత్వం వహించాడు. రహానే చేరికపై అమ్‌స్టర్‌డామ్ ఫ్లేమ్స్ సహ వ్యవస్థాపకుడు స్టీవ్ వా హర్షం వ్యక్తం చేశాడు. రహానే నైపుణ్యం, నాయకత్వ లక్షణాలు, వినయం జట్టుకు ఎంతో మేలు చేస్తాయని అన్నాడు. యూరప్‌లో క్రికెట్ అభివృద్ధికి తన వంతు సహకారం అందించడం, ఒక విజయవంతమైన ఫ్రాంచైజీని నిర్మించడంలో పాలుపంచుకోవడం సంతోషంగా ఉందని రహానే పేర్కొన్నాడు. ఈ కొత్త లీగ్‌కు రహానే వంటి స్టార్ ఆటగాడి రాక మంచి బూస్ట్ ఇస్తుందని విశ్లేషకులు భావిస్తున్నారు.

# దేశంలో అత్యుత్తమ జోన్‌గా విశాఖ జోన్.. రూ.2,493 కోట్ల ఆదాయంతో రికార్డు

సౌత్ కోస్ట్ రైల్వే జోన్ ఉత్తమ జోన్‌గా నిలిచిందన్న రైల్వే శాఖ

ఏపీలో ప్రస్తుతం రూ.54వేల కోట్ల విలువైన పనులు పురోగతిలో ఉన్నాయని వెల్లడి




విశాఖపట్నం కేంద్రంగా ఏర్పాటైన సౌత్ కోస్ట్ రైల్వే జోన్ అతిస్వల్ప కాలంలోనే రికార్డు స్థాయి పురోగతి సాధించి, వార్షికంగా రూ.2,493 కోట్ల రాబడితో దేశంలోనే అత్యుత్తమ జోన్‌గా నిలిచిందని కేంద్ర రైల్వే శాఖ వెల్లడించింది. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో రూ.54,000 కోట్ల విలువైన రైల్వే అభివృద్ధి పనులు పురోగతిలో ఉన్నాయని, మరో రూ.71,000 కోట్ల ప్రాజెక్టులు పైప్‌లైన్‌లో ఉన్నాయని పేర్కొంది. విశాఖ రైల్వే యార్డ్ ఆధునికీకరణ కోసం రూ.300 కోట్లు కేటాయించామని, అందులో భాగంగా 6 కొత్త ప్లాట్‌ఫామ్‌లు అందుబాటులోకి రానున్నాయని స్పష్టం చేసింది.

అలాగే గుంతకల్-బళ్లారి నాలుగు లైన్ల విస్తరణకు రూ.1,205 కోట్లు మంజూరు చేసినట్లు కేంద్రం తెలిపింది. రైళ్ల భద్రత కోసం 100 ఇంజిన్లలో 'కవచ్' వ్యవస్థను ఏర్పాటు చేశామని తెలిపింది. ఏపీ వ్యాప్తంగా 300కు పైగా ఆర్‌వోబీ, ఆర్‌యూబీల నిర్మాణం, అమృత్ భారత్ కింద 70కి పైగా స్టేషన్ల అభివృద్ధి, విజయవాడలో స్లీపింగ్ పాడ్స్, రాబోయే గోదావరి పుష్కరాల ముందస్తు ఏర్పాట్లతో రాష్ట్రంలో రైల్వే వ్యవస్థను వేగంగా ఆధునీకరిస్తున్నట్లు వివరించింది.

# సూచీలకు ఫైనాన్షియల్ షేర్ల బ్రేక్.. నష్టాల్లో ముగిసిన మార్కెట్లు

దేశీయ స్టాక్ మార్కెట్లు నేడు నష్టాలతో ముగిశాయి. ఫైనాన్షియల్, ప్రైవేట్ బ్యాంకింగ్ స్టాక్స్‌లో అమ్మకాల ఒత్తిడి, పెరుగుతున్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. ఫలితంగా మార్కెట్ ప్రారంభం నుంచి ఒడిదొడుకులకు లోనైంది. దిగ్గజ ఫైనాన్షియల్ స్టాక్స్‌లో బలహీనత కారణంగా ప్రధాన సూచీలు నష్టాల్లోకి జారుకున్నాయి. శుక్రవారం ట్రేడింగ్ ముగిసే సమయానికి, సెన్సెక్స్ 455.59 పాయింట్లు క్షీణించి 78,499.17 వద్ద స్థిరపడింది. ఇక, నిఫ్టీ 65.35 పాయింట్లు నష్టపోయి 24,570.65 వద్ద ముగిసింది. ఫైనాన్షియల్ స్టాక్స్‌లో ఇన్వెస్టర్లు తమ పెట్టుబడులను తగ్గించుకోవడంతో మార్కెట్ సెంటిమెంట్ రోజంతా బలహీనంగానే ఉంది. ముఖ్యంగా నిఫ్టీ ఫైనాన్షియల్ సర్వీసెస్, నిఫ్టీ ప్రైవేట్ బ్యాంక్ సూచీలు అత్యధికంగా నష్టపోయి మార్కెట్‌పై తీవ్ర ఒత్తిడిని పెంచాయి. నిఫ్టీ షేర్లలో బజాజ్ ఫైనాన్స్, బజాజ్ ఫిన్‌సర్వ్, ట్రెంట్ టాప్ లూజర్లుగా నిలిచాయి. అయితే, ప్రధానసూచీలు నష్టపోయినప్పటికీ బ్రాడర్ మార్కెట్ కొంత మేర తట్టుకుని నిలబడింది. నిఫ్టీ మిడ్‌క్యాప్ ఇండెక్స్ 0.22శాతం లాభపడగా, నిఫ్టీ స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 0.05 శాతం స్వల్పంగా నష్టపోయింది. రంగాల వారీగా చూస్తే..ఆటో, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ) షేర్లు మార్కెట్‌కు కొంత మద్దతునిచ్చాయి. నిఫ్టీ ఆటో, నిఫ్టీ ఐటీ సూచీలు ప్రధాన రంగాల్లో టాప్ గెయినర్లుగా నిలిచి,సూచీల నష్టాలను కొంతవరకుపరిమితం చేశాయి.

# డాబర్‌కు హైకోర్టులో భారీ ఊరట.. ఎఫ్ఎస్ఎస్ఏఐ ఆదేశాలకు బ్రేక్

డాబర్‌కు ఢిల్లీ హైకోర్టులో తాత్కాలిక ఊరట - ఎఫ్ఎస్ఎస్ఏఐ నిషేధ ఆదేశాలపై ఆగస్టు 24 వరకు స్టే

విచారణ అవకాశం ఇవ్వలేదని హైకోర్టు అభిప్రాయం - '100 శాతం' క్లెయిమ్‌లపై ఎఫ్ఎస్ఎస్ఏఐ అభ్యంతరం

తమ ప్రకటనలు నిబంధనలకు అనుగుణమేనని డాబర్ వాదన - కేంద్రం, ఎఫ్ఎస్ఎస్ఏఐకి నోటీసులు జారీ చేసిన హైకోర్టు

ప్రముఖ ఎఫ్ఎంసీజీ సంస్థ డాబర్ ఇండియాకు ఢిల్లీ హైకోర్టులో తాత్కాలిక ఊరట లభించింది. '100 శాతం' అంటూ ప్రచారం చేస్తున్న కొన్ని ఉత్పత్తుల విక్రయాలను నిలిపేయాలని ఆహార భద్రత నియంత్రణ సంస్థ ఎఫ్ఎస్ఎస్ఏఐ జారీ చేసిన ఆదేశాలపై కోర్టు శుక్రవారం స్టే విధించింది. తదుపరి విచారణ జరిగే ఆగస్టు 24 వరకు ఈ స్టే అమల్లో ఉంటుందని స్పష్టం చేసింది.

డాబర్‌కు వాదనలు వినిపించే అవకాశం ఇవ్వకుండా ఇలాంటి నిషేధాజ్ఞలు జారీ చేయడం సరైన విధానం కాదని జస్టిస్ అమిత్ మహాజన్ అభిప్రాయపడ్డారు. ఈ దశలో డాబర్ వాదనల్లో ప్రాథమికంగా బలం కనిపిస్తోందని పేర్కొంటూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. అదే సమయంలో కేంద్ర ప్రభుత్వం, ఎఫ్ఎస్-ఎస్ఏఐకి నోటీసులు జారీ చేసి వివరణ కోరారు.




తేనె, ఆవు నెయ్యి, వంట నూనెలు, యాపిల్ సైడర్ వెనిగర్, కొబ్బరినీళ్లు తదితర ఉత్పత్తులపై '100 శాతం నేచురల్', '100 శాతం ప్యూర్', '100 శాతం ప్యూరిటీ గ్యారంటీ', '100 శాతం ఆర్గానిక్', '100 శాతం టెండర్ కొబ్బరి నీళ్లు' వంటి ప్రచారాలు నిబంధనలకు విరుద్ధమని ఎఫ్ఎస్ఎస్ఏఐ అభ్యంతరం వ్యక్తం చేసింది. ఇవి వినియోగదారులను తప్పుదోవ పట్టించే అవకాశం ఉందని పేర్కొంది. డాబర్ హిమాలయన్ ఆర్గానిక్ యాపిల్ సైడర్ వెనిగర్, డాబర్ ఆర్గానిక్ హనీపై జైవిక్ భారత్ లోగో వినియోగంపైనా ఎఫ్ఎస్ఎస్ఏఐ అభ్యంతరం తెలిపింది. అలాగే డాబర్ హోమ్‌మేడ్ కొబ్బరిపాలపై '100 శాతం ప్యూరిటీ' అనే క్లెయిమ్ కూడా అనుమతించదగినది కాదని పేర్కొంది. అయితే ఈ ఉత్పత్తులను దశాబ్దాలుగా విక్రయిస్తున్నామని, షోకాజ్ నోటీసు ఇవ్వకుండా, తమ వాదనలు వినకుండా నిషేధం విధించడం సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధమని డాబర్ కోర్టుకు వివరించింది. తమ ఉత్పత్తుల లేబుళ్లు అన్ని చట్టాలు, నిబంధనలకు అనుగుణంగానే ఉన్నాయని, వినియోగదారులను తప్పుదోవ పట్టించే ప్రకటనలు ఎప్పుడూ చేయలేదని పేర్కొంది.

# ఏఐతో కొత్త వైరస్ సృష్టించిన శాస్త్రవేత్తలు.. ప్రపంచంలో తొలిసారి

రూపొందించిన 16 వైరస్‌లు ప్రయోగశాలలో విజయవంతం

ఇవి బ్యాక్టీరియాపై మాత్రమే దాడి చేస్తాయి - ఈవో-1, ఈవో-2 మోడళ్లతో డీఎన్ఏ

కొన్ని వైరస్‌లు ఈ.కోలైపై మెరుగైన ఫలితాలు

యాంటీబయోటిక్ నిరోధక బ్యాక్టీరియాపై కొత్త ఆశలు



అమెరికాలోని స్టాన్‌ఫోర్డ్ విశ్వవిద్యాలయం, ఆర్క్ ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన శాస్త్రవేత్తలు కృత్రిమ మేధ (ఏఐ) సాయంతో ప్రకృతిలో లేని కొత్త వైరస్‌లను రూపొందించారు. వాటిలో 16 వైరస్‌లు ప్రయోగశాలలో విజయవంతంగా పనిచేశాయి. ఇవి మనుషులు, జంతువులు, మొక్కలకు హాని చేయవు. బ్యాక్టీరియాపై మాత్రమే దాడి చేస్తాయి. ఈ పరిశోధన సైన్స్ జర్నల్‌లో ప్రచురితమైంది. ఈ వైరస్‌లను రూపొందించేందుకు శాస్త్రవేత్తలు ఈవో-1, ఈవో-2 పేర్లతో ఉన్న ఏఐ మోడళ్లను ఉపయోగించారు. చాట్‌జీపీటీ పదాలను అంచనా వేసినట్లు, ఈ మోడళ్లు డీఎన్ఏలో వచ్చే అక్షరాల క్రమాన్ని అంచనా వేస్తాయి. లక్షలాది జన్యు సమాచారాన్ని విశ్లేషించిన తర్వాత పూర్తిగా కొత్త వైరస్‌ల నమూనాలను రూపొం దించాయి. ఏఐ రూపొందించిన లక్షల నమూనాల్లో దాదాపు 300ను ఎంపిక చేసి ప్రయోగశాలలో తయారు చేశారు. వాటిని బ్యాక్టీరియాలో పరీక్షించగా 16 వైరస్‌లు విజయవంతంగా పనిచేశాయి. వాటిలో కొన్ని సహజంగా ఉండే వైరస్‌ల కంటే వేగంగా పెరిగాయి. మరికొన్ని సహజ వైరస్‌లకు నిరోధక శక్తిని పెంచుకున్న ఈ.కోలై బ్యాక్టీరియాను కూడా సమర్థంగా నాశనం చేశాయి. యాంటీబయోటిక్స్‌కు లొంగని బ్యాక్టీరియాపై పోరాటం లో ఈ పరిశోధన ఉపయోగపడే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. అవసరానికి అనుగుణంగా కొత్త వైరస్‌లను రూపొందించి ప్రమాదకర బ్యాక్టీరియాను ఎదుర్కోవచ్చని చెబుతున్నారు. అయితే ఈ విజయంతో పాటు ఆందోళనలు కూడా వ్యక్తమవుతున్నాయి. వైరస్‌ల జన్యు నిర్మాణాన్ని ఏఐతో రూపొందించే సాంకేతికత అందుబాటులోకి వచ్చినా, దాన్ని నియంత్రించే స్పష్టమైన నిబంధనలు ఇంకా లేవని పలువురు నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రస్తుతం ఉపయోగించిన మోడల్‌లో మనుషులు, జంతువులు, మొక్కలకు సోకే వైరస్‌ల సమాచారాన్ని చేర్చలేదని పరిశోధకులు స్పష్టం చేశారు. భద్రతా ప్రమాణాలు పాటిస్తూ ఈ ప్రయోగాలు నిర్వహించినట్లు వెల్లడించారు.

# నకిలీ నోట్లపై ఆర్బీఐ కీలక నివేదిక.. రూ.500తో పాటు చిన్న నోట్లూ ఫేకే!

చిన్న నోట్లపై దృష్టి సారించిన దొంగనోట్ల ముఠాలు

ఈ కుట్ర వెనుక దావూద్ సిండికేట్, పాక్ ఐఎస్ఐ హస్తం ఉన్నట్లు నిఘా వర్గాల అనుమానం

రూ.20 నకిలీ నోట్లు 47.4 శాతం పెరిగాయని తెలిపిన ఆర్బీఐ - మొత్తం నకిలీ నోట్ల గుర్తింపు 5.7 శాతం పెరిగినట్లు వెల్లడి

సిబ్బందికి శిక్షణ ఇవ్వాలని బ్యాంకులకు ఆర్బీఐ ఆదేశాలు - అధికంగానే కొనసాగుతున్న రూ.500 నకిలీ నోట్ల దందా



భారతదేశంలో నకిలీ కరెన్సీ చలామణిలో నేర ముఠాలు తమ వ్యూహాన్ని మార్చాయి. పాకిస్థాన్ గూఢచార సంస్థ ఐఎస్ఐ మద్దతుతో పనిచేసే దావూద్ ఇబ్రహీం నెట్‌వర్క్‌తో సహా ఇతర సిండికేట్లు, ఇప్పటివరకు రూ.500 వంటి పెద్ద నోట్లను లక్ష్యంగా చేసుకున్నాయి. అయితే, ఇప్పుడు తమ దృష్టిని రూ.10, రూ.20, రూ.50 వంటి తక్కువ విలువ కలిగిన నోట్లపైకి మళ్లించాయని భారత భద్రతా సంస్థలు గుర్తించాయి. మార్కెట్లోకి ఈ చిన్న నకిలీ నోట్లను భారీగా చలామణిలోకి తెచ్చి, భారత ఆర్థిక వ్యవస్థను దెబ్బతీయాలనేది వారి ప్రణాళికగా తెలుస్తోంది. 'నకిలీ భారత కరెన్సీ నోట్ల' (ఎఫ్ఐసీఎన్) చలామణిని అరికట్టేందుకు అధికారులు కఠిన చర్యలు తీసుకుంటున్న వేళ, ఈ కొత్త ధోరణి వెలుగులోకి వచ్చింది.

భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్బీఐ) విడుదల చేసిన 2025-26 వార్షిక నివేదిక ప్రకారం.. బ్యాంకింగ్ వ్యవస్థలో గుర్తించిన మొత్తం దొంగనోట్ల సంఖ్య 5.7 శాతం పెరిగింది. ముఖ్యంగా రూ.20 నకిలీ నోట్ల గుర్తింపు ఏకంగా 47.4 శాతం మేర పెరగడం ఆందోళన కలిగిస్తోంది. మరోవైపు అత్యధికంగా చలామణిలో ఉన్న రూ.500 నకిలీ నోట్లు ఇప్పటికీ అధిక సంఖ్యలోనే పట్టుబడుతున్నాయి. అయితే, రూ.100, రూ.50 నకిలీ నోట్ల సంఖ్యలో కొంత తగ్గుదల కనిపించగా, ఇప్పటికే రద్దయిన రూ.2000 నకిలీ నోట్ల చలామణి గణనీయంగా క్షీణించింది.

ఈ పరిణామాల నేపథ్యంలో ఆర్బీఐ అప్రమత్తమైంది. నకిలీ నోట్లను గుర్తించే పద్ధతులపై బ్యాంకుల్లో నగదు నిర్వహణ సిబ్బందికి నిర్దేశిత గడువులోగా శిక్షణ ఇవ్వాలని ఆదేశాలు జారీ చేసింది. ముఖ్యంగా సరిహద్దు జిల్లాల్లోని బ్రాంచ్‌లకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించింది. నకిలీ నోట్లను గుర్తించి, స్వాధీనం చేసుకోవడంలో విఫలమైతే, నోటు విలువను బట్టి జరిమానాలు ఉంటాయని హెచ్చరించింది. ఇటీవల దేశంలోని పలు రాష్ట్రాల్లో జరిగిన దాడుల్లో పెద్ద, చిన్న విలువ కలిగిన నకిలీ నోట్లు పట్టుబడగా, స్థానిక నెట్‌వర్క్‌ల ద్వారా వీటిని ముద్రిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ఈ నెట్‌వర్క్‌లను అరికట్టేందుకు నిఘాను ముమ్మరం చేసినట్లు దర్యాప్తు సంస్థలు తెలిపాయి.

# గుడ్డు పచ్చసొన ముదురు నారింజ రంగులో ఉందా? అసలు కారణం ఇదే!

కోడి తినే ఆహారం ఆధారంగా గుడ్డు పచ్చసొన రంగు

కెరోటినాయిడ్లు ఎక్కువైతే ముదురు రంగు

ముదురు రంగు అంటే ఫ్రీరేంజ్ గుడ్డు అని కాదు

ల్యూటిన్, జియాక్సాంథిన్ కొద్దిగా ఎక్కువగా ఉండే అవకాశం

మిగతా పోషకాల్లో పెద్దగా తేడా ఉండదంటున్న పరిశోధనలు

రైతులు ఆహారం మారిస్తే పచ్చసొన రంగు మారే అవకాశం



గుడ్డు పగలగొట్టగానే ముదురు నారింజ రంగులో పచ్చసొన కనిపిస్తే చాలామంది అది మంచి నాణ్యత ఉన్న గుడ్డని భావిస్తారు. పోషకాలు ఎక్కువగా ఉంటాయని అనుకుంటారు. సోషల్ మీడియాలో కూడా ఇలాంటి గుడ్లను 'ప్రీమియం'గా చూపించే వీడియోలు తరచూ కనిపిస్తున్నాయి. కానీ పచ్చసొన రంగు ఒక్కటే గుడ్డు నాణ్యతను చెప్పదని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. పచ్చసొన రంగు కోడి జాతిని బట్టి మారదు. అది కోడి తినే ఆహారంపై ఆధారపడి ఉంటుంది. మొక్కజొన్న, ఆకుకూరలు, బంతిపూలు, ఎర్ర మిరప, క్యాప్సికం లాంటి కెరోటినాయిడ్లు ఎక్కువగా ఉండే ఆహారం తింటే పచ్చసొన ముదురు నారింజ రంగులోకి మారుతుంది. అదే ఈ పదార్థాలు తక్కువగా ఉన్న ఆహారం తీసుకుంటే పచ్చసొన లేత పసుపు రంగులో ఉంటుంది. చాలామంది ముదురు రంగు పచ్చసొన ఉన్న గుడ్లు తప్పనిసరిగా ఫ్రీరేంజ్ కోళ్లవే అనుకుంటారు. కానీ అది నిజం కాదు. బయట తిరిగే కోళ్లు సహజంగా గడ్డి, పురుగులు తినడం వల్ల అలాంటి రంగు రావచ్చు. అదే ఆహారాన్ని ఫారాల్లో పెంచే కోళ్లకు ఇస్తే వాటి గుడ్లలో కూడా అదే రంగు కనిపిస్తుంది.

ముదురు పచ్చసొనలో ల్యూటిన్, జియాక్సాంథిన్ వంటి యాంటీఆక్సిడెంట్లు కొద్దిగా ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. ఇవి కంటి ఆరోగ్యానికి ఉపయోగపడతాయి. అయినా ప్రొటీన్, కొవ్వు, విటమిన్లు, ఖనిజాలు, క్యాలరీల పరంగా లేత పచ్చసొన గుడ్లకు, ముదురు వాటికి పెద్దగా తేడా ఉండదని పరిశోధనలు చెబుతున్నాయి.

వినియోగదారుల అభిరుచిని బట్టి రైతులు కోళ్ల ఆహారాన్ని కూడా మార్చుతుంటారు. బంతిపూలు, మిరప, ఇతర సహజ పదార్థాలు కలిపిన మేత ఇస్తే పచ్చసొన మరింత ముదురు రంగులో కనిపిస్తుంది. అంటే రంగు మారడానికి కారణం గుడ్డు కాదు.. కోడి తిన్న ఆహారమే. అందుకే గుడ్డు నాణ్యతను పచ్చసొన రంగుతో మాత్రమే అంచనా వేయకూడదు. గుడ్డు ఎంత తాజాగా ఉంది? ఎలా నిల్వ చేశారు? కోళ్లను ఎలా పెంచారు? వంటి అంశాలే అసలు నాణ్యతను నిర్ణయిస్తాయని నిపుణులు సూచిస్తున్నారు.

# భారత్‌తో టెస్ట్ సిరీస్: అభిమానులకు శ్రీలంక బోర్డు బంపరాఫర్

భారత్‌తో జరగనున్న టెస్ట్ సిరీస్‌లకు ఉచిత ప్రవేశం - శ్రీలంక క్రికెట్ బోర్డు అధికారిక ప్రకటన

గాలె, కొలంబోలలో జరగనున్న రెండు టెస్ట్ మ్యాచ్‌లు - ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్‌లో భాగంగా సిరీస్



క్రికెట్ అభిమానులకు శ్రీలంక క్రికెట్ (ఎస్ఎల్‌సీ) బోర్డు తీపి కబురు అందించింది. భారత్‌తో స్వదేశంలో జరగనున్న రెండు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌ను వీక్షించేందుకు స్టేడియంలోకి అభిమానులకు ఉచిత ప్రవేశం కల్పిస్తున్నట్లు శుక్రవారం ప్రకటించింది. అంతర్జాతీయ టెస్టు క్రికెట్‌ను ప్రత్యక్షంగా వీక్షించేందుకు అభిమానులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు బోర్డు ఒక ప్రకటనలో పేర్కొంది. ఈ సిరీస్ ఐసీసీ వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ 2025--27లో భాగంగా జరగనుంది. తొలి టెస్టు ఆగస్టు 15 నుంచి 19 వరకు గాలె అంతర్జాతీయ స్టేడియంలో, రెండో టెస్టు ఆగస్టు 23 నుంచి 27 వరకు కొలంబోలోని సింహళీస్ స్పోర్ట్స్ క్లబ్ మైదానంలో జరగనున్నాయి. ప్రేక్షకుల రద్దీని దృష్టిలో ఉంచుకుని స్టేడియంలోకి ప్రవేశించేందుకు ప్రత్యేక ద్వారాలను కేటాయించారు. గాలె స్టేడియంలో గేట్ నెంబర్ 4 ద్వారా, కొలంబో స్టేడియంలో గేట్లు నెంబర్లు 3, 4, 5, 7 ద్వారా ప్రేక్షకులను అనుమతిస్తారు. ప్రస్తుతం వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ పట్టికలో భారత్ 5వ స్థానంలో ఉండగా, శ్రీలంక 6వ స్థానంలో ఉంది. ఇటీవల వెస్టిండీస్‌తో జరిగిన సిరీస్‌లో శ్రీలంక పరాజయం పాలైంది. ఈ నేపథ్యంలో దేశవ్యాప్తంగా ఉన్న క్రికెట్ అభిమానులు, యువ క్రీడాకారులు, వారి కుటుంబ సభ్యులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని మ్యాచ్‌లకు హాజరు కావాలని శ్రీలంక క్రికెట్ బోర్డు పిలుపునిచ్చింది.



# ఆపరేషన్ మధ్యలో భారీ భూకంపం..

డాక్టర్లు చేసిన పని చూసి ప్రపంచం ఫిదా

ఆపరేషన్ జరుగుతుండగా జపాన్‌లో భూకంపం

రోగిని వదల్లేక టేబుల్‌ను గట్టిగా పట్టుకున్న వైద్యులు

పరికరాలు కదిలినా వెనక్కి తగ్గని వైద్య బృందం

శస్త్రచికిత్సను కొద్దిసేపు నిలిపి మళ్లీ పూర్తి చేసిన వైనం

ఘటన వీడియో సోషల్ మీడియాలో వైరల్

భూకంపంలో 38 మంది మృతి, 120 మందికిపైగా గాయాలు

ఆపరేషన్ థియేటర్‌లో ప్రాణం కోసం పోరాటం జరుగుతోంది. అదే సమయంలో భూమి ఒక్కసారిగా బలంగా కంపించింది. గోడలు వణికాయి.. పరికరాలు కదిలిపోయాయి.. అయినా వైద్యులు ఒక్క అడుగు కూడా వెనక్కి వేయలేదు. రోగిని వదిలి బయటకు వెళ్లకుండా, ఆపరేషన్ టేబుల్‌ను గట్టిగా పట్టుకుని అతణ్ని కాపాడారు. జపాన్‌లో జరిగిన ఈ ఘటనకు సంబంధించిన వీడియో ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా వైరల్‌గా మారింది. జపాన్‌లోని కుమమోటోలో ఓ ఆసుపత్రిలో శస్త్రచికిత్స జరుగుతుండగా 7.1 తీవ్రతతో భూకంపం సంభవించింది. ఒక్కసారిగా ఆపరేషన్ థియేటర్ మొత్తం ఊగిపోయింది. లైట్లు కంపించాయి. వైద్య పరికరాలు కదిలిపోయాయి. వైద్య సిబ్బంది నిలబడటానికే ఇబ్బంది పడినా రోగిని మాత్రం వదల్లేదు. వీడియోలో కొందరు వైద్యులు ఆపరేషన్ టేబుల్ కదలకుండా గట్టిగా పట్టుకుని కనిపించారు. మరో వైద్యుడు కదులుతున్న పరికరాన్ని అదుపు చేసే ప్రయత్నంలో కిందపడిపోయాడు. అయినా వెంటనే లేచి తన బాధ్యతను కొనసాగించాడు. భూకంపం తగ్గే వరకు వైద్య బృందం రోగికి రక్షణగా నిలిచింది. భూకంపం కారణంగా శస్త్రచికిత్సను కొద్దిసేపు నిలిపివేశారు. పరిస్థితి అదుపులోకి వచ్చిన తర్వాత మళ్లీ ఆపరేషన్‌ను ప్రారంభించారు. చివరకు శస్త్రచికిత్సను విజయవంతంగా పూర్తి చేసినట్లు జపాన్ మీడియా వెల్లడించింది. కొద్ది రోజులకే ఆసుపత్రి సాధారణ సేవలను తిరిగి ప్రారంభించింది. జులై 28 మధ్యాహ్నం జపాన్‌లోని క్యుషూ ద్వీపాన్ని 7.1 తీవ్రతతో భూకంపం తాకింది. ఈ ఘటనలో సుమారు 38 మంది ప్రాణాలు కోల్పోయారు. 120 మందికిపైగా గాయపడ్డారు. అనేక ఇళ్లు కూలిపోయాయి. రహదారులు దెబ్బతిన్నాయి. వేలాది ఇళ్లకు విద్యుత్, తాగునీటి సరఫరా నిలిచిపోయింది. వేలాది మంది సహాయ శిబిరాలకు తరలిపోయారు. ఈ ప్రకంపనలు దక్షిణ కొరియాలో కూడా నమోదయ్యాయి.

# వాట్సాప్ యూజర్లకు హెచ్చరిక.. ఇలాంటి ఫైల్స్ ఓపెన్ చేయొద్దు!

వాట్సాప్ మాల్‌వేర్ దాడి నుంచి 10,000 మంది భారతీయులకు రక్షణ

జిప్ ఫైల్స్ పంపి ఖాతాలను హైజాక్ చేస్తున్న సైబర్ నేరగాళ్లు

విండోస్ కంప్యూటర్లలోకి ట్రోజన్ వైరస్ పంపిస్తున్న వైనం

మాల్‌వేర్ సర్వర్లను బ్లాక్ చేసి దాడిని అడ్డుకున్న ఐ4సీ

ఢిల్లీ, గుజరాత్ సహా పలు రాష్ట్రాల్లో వెలుగుచూసిన కేసులు



దేశవ్యాప్తంగా 10,000 మందికి పైగా భారతీయులను లక్ష్యంగా చేసుకున్న భారీ వాట్సాప్ మాల్‌వేర్ దాడిని విజయవంతంగా అడ్డుకున్నట్లు కేంద్ర హోం మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ఇండియన్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ (ఐ4సీ) చేపట్టిన సమన్వయ చర్యల ద్వారా ఈ ముప్పును నివారించినట్లు తెలిపింది. కొంతకాలంగా వాట్సాప్ ఖాతాలను హ్యాక్ చేస్తున్నారంటూ నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్‌కు ఫిర్యాదులు వెల్లువెత్తాయి. దీనిపై రంగంలోకి దిగిన ఐ4సీ దర్యాప్తు చేపట్టగా సైబర్ నేరగాళ్ల కొత్త తరహా మోసం వెలుగులోకి వచ్చింది. ఆర్‌బీఐ లేదా ఎంసీఏ వంటి ప్రభుత్వ సంస్థల నుంచి పంపినట్లుగా »Statement of Account.zipµ లేదా '=దీ×.ఓఅజూ' వంటి పేర్లతో వాట్సాప్, ఎస్ఎంఎస్ లేదా ఈ-మెయిల్‌కు హానికరమైన ఫైల్స్‌ను పంపుతున్నారు. ఈ జిప్ ఫైల్స్‌ను విండోస్ కంప్యూటర్‌లో ఓపెన్ చేసినప్పుడు, సిస్టమ్‌లోకి ఒక ట్రోజన్ వైరస్ ఇన్‌స్టాల్ అవుతుంది. ఇది వెంటనే కంప్యూటర్‌ను తన ఆధీనంలోకి తీసుకుని, యాక్టివ్‌గా ఉన్న వాట్సాప్ వెబ్ సెషన్‌ను హైజాక్ చేస్తుంది. ఆ తర్వాత హ్యాక్ చేసిన ఖాతా నుంచే బాధితుడి కాంటాక్టులు, గ్రూపులకు ఆటోమేటిక్‌గా అవే మాల్‌వేర్ ఫైల్స్ వెళుతున్నాయి. ఇప్పటికే ఢిల్లీ, గుజరాత్, మహారాష్ట్ర, రాజస్థాన్ వంటి రాష్ట్రాల్లో ఇలాంటి కేసులు నమోదయ్యాయి. దీంతో 'సహయోగ్ పోర్టల్' ద్వారా మాల్‌వేర్‌కు సంబంధించిన కమాండ్-అండ్-కంట్రోల్ సర్వర్లను జియో-బ్లాక్ చేసి ఈ దాడిని నిలువరించినట్లు హోం శాఖ వివరించింది. ఇలాంటి మోసాలపై ఐ4సీ గత జూన్ 22నే ఒక హెచ్చరిక జారీ చేసింది.

# సినిమా న్యూస్

## మూవీ రివ్యూ : కొరియన్ కనకరాజు




'కొరియన్ కనకరాజు' మూవీ రివ్యూ నటీనటులు: వరుణ్ తేజ్ – రితిక యాదవ్ – సత్య – సునీల్ – మురళీధర్ గౌడ్ – వీటీవీ గణేష్ – అవసరాల శ్రీనివాస్ – చిన్నా – తులసి తదితరులు సంగీతం: తమన్ ఛాయాగ్రహణం: మనోజ్ రెడ్డి నిర్మాతలు: రాజీవ్ రెడ్డి – సాయిబాబు జాగర్లమూడి రచన – దర్శకత్వం: మేర్లపాక గాంధీ ఒక మంచి హిట్టు కోసం చాలా కాలంగా ఎదురు చూస్తున్నాడు మెగా కుర్రాడు వరుణ్ తేజ్. దర్శకుడు మేర్లపాక గాంధీది కూడా అదే పరిస్థితి. వీళ్లిద్దరూ కలిసి చేసిన సినిమా.. కొరియన్ కనకరాజు. క్రేజీ ప్రోమోలతో ప్రేక్షకుల్లో ఆసక్తి రేకెత్తించిన ఈ చిత్రం ఇప్పుడు థియేటర్లలోకి దిగింది. దీని విశేషాలేంటో చూద్దాం పదండి. కథ: కనకరాజు (వరుణ్ తేజ్) ఆంధ్రప్రదేశ్ లోని అనంతపురం జిల్లాలో పెనుగొండకు చెందిన కుర్రాడు. ఆ ప్రాంతంలో చెక్క భజన బృందాన్ని నడిపిస్తూ జీవిస్తుంటాడు. మహా కోపిష్టి అయిన అతను.. తన జోలికి వచ్చిన ఎవ్వరిని వదిలి పెట్టడు. అతను ఒక గొడవ తర్వాత అరాచకంగా ప్రవర్తించడం మొదలు పెడతాడు. అప్పుడే అతడికి దెయ్యం పట్టిందని తెలుస్తుంది. కానీ అది కొరియన్ దయ్యం అని తెలిసి అందరూ అవక్కవుతారు. పెనుగొండలో ఉండే కనకరాజుకు కొరియన్ దయ్యం పట్టడం ఏంటి.. ఇంతకీ ఆ దెయ్యం కథేంటి.. ఈ దయ్యం బారి నుంచి కనకరాజు తప్పించుకున్నాడా లేదా అన్నది మిగతా కథ. ాూసజవతీఱంవఎవత్ కథనం – విశ్లేషణ: మేర్లపాక గాంధీ వినోదానికి పేరుపడ్డ దర్శకుడు. వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్.. ఎక్స్‌ప్రెస్ రాజా సినిమాల్లో అతను ఎంతగా నవ్వించాడో తెలిసిందే. కామెడీ పండే కథ కుదిరితే.. అతను ట్రెండీ వినోదంతో చెలరేగిపోతాడనడానికి ఈ సినిమాలే ఉదాహరణ. కానీ ఆ తర్వాత తన బలాన్ని విడిచిపెట్టి భిన్నంగా ఏదో చేయాలని ట్రై చేసి 'కృష్ణార్జున యుద్ధం'.. 'లైక్ షేర్ సబ్‌స్క్రైబ్' చిత్రాలతో ఎదురు దెబ్బలు తిన్నాడు. ఐతే ఈసారి మాత్రం అతను తన బలాన్నే నమ్ముకున్నాడు. కామెడీ మీద గురి పెట్టాడు. అందుకోసం నేలవిడిచి సాము ఏమీ చేయలేదు. తెలుగు సినిమాల్లో ఎన్నోసార్లు చూసిన.. మారుతి సహా చాలామంది దర్శకులు అరగదీసేసిన హార్రర్ కామెడీ జానరే ఎంచుకున్నాడు. కాకపోతే ఎప్పుడూ చూసే లోకల్ దయ్యాలను కాకుండా కొరియన్ దయ్యాన్ని తన కథలోకి తీసుకురావడమే ఈ సినిమా స్పెషాలిటీ. సినిమా రొటీన్ గానే అనిపించినా సరే.. ఈ 'కొరియన్' టచ్ వల్ల కాస్త భిన్నమైన సినిమా చూస్తున్న ఫీలింగ్ కలుగుతుంది. ఇక కామెడీ రాయడంలో–తీయడంలో తనకున్న పట్టును మళ్లీ చూపించిన మేర్లపాక గాంధీ.. కొన్ని పేలిపోయే ఎపిసోడ్లతో ప్రేక్షకులను బాగానే నవ్వించాడు. ఇది ఆహా ఓహో అనిపించే సినిమా కాదు కానీ.. కాలక్షేపానికైతే ఢోకా లేదు. తెలుగులో చాలా త్వరగా ప్రేక్షకులకు మొనాటనీ తెప్పించేసిన జానర్లలో 'హార్రర్ కామెడీ' ఒకటి. ఈ జానర్ సినిమా అనగానే ఒకే రకమైన కథలు తెరకెక్కడంతో జనాలకు విసుగొచ్చేసింది. లీడ్ క్యారెక్టర్లోకి దయ్యం దూరి.. అందరినీ ఒక ఆటాడుకునే కథలకు తెలుగులో లెక్కే లేదు. 'కొరియన్ కనకరాజు' కూడా ఇలాంటి సగటు హార్రర్ స్టోరీనే. కాకపోతే గాంధీ.. కొరియా నుంచి వచ్చిన ఒక దయ్యం ఆత్మ అనంతపురం కుర్రాడిలోకి చేరడం అనే పాయింటుతో మార్కులు కొట్టేశాడు. ఇందుకోసం ఆ ప్రాంతంలోని 'కియా' కారు కంపెనీతో పెట్టిన కనెక్షన్ హైలైట్. దయ్యంతో ముడిపడ్డ సినిమాలంటేనే లాజిక్కులతో పనిలేదు కాబట్టి.. కొరియన్ దయ్యం అనంతపురం కుర్రాడి ఒంట్లోకి చేరడం.. ఆ తర్వాత జరిగే పరిణామాల నేపథ్యంలో కొంచెం కన్వీనియెంట్ గానే కథాకథనాలు రాసుకున్నాడు గాంధీ. మూల కథ వరకు బాగున్నా.. కథను మొదలుపెట్టిన తీరు బాగున్నా.. ఆ తర్వాత దాన్ని నడిపించిన విధానం అంత ఎగ్జైటింగ్ గా ఏమీ కనిపించదు. హీరో పరిచయ సన్నివేశాలతో మొదలుకుని కొంత వరకు చాలా సాధారణంగా అనిపిస్తుంది 'కొరియన్ కనకరాజు'. కానీ కనకరాజు పాత్ర మామూలుగా అనిపించినా.. అతడిలోకి కొరియా ఆత్మ చేరాక మాత్రం కథ ఊపందుకుంటుంది. క్రేజీగా మారే హీరో పాత్ర.. దానికి తోడు పక్కనే సత్య లాంటి తిరుగులేని కామెడీ టైమింగ్ ఉన్న నటుడు.. ఇక వినోదానికి ఢోకా ఏముంది? హీరోను కూడా డామినేట్ చేస్తూ సత్య పండించిన వినోదంతో 'కొరియన్ కనకరాజు' ప్రేక్షకులకు కావాల్సినంత వినోదాన్ని పంచుతుంది. ముఖ్యంగా కొరియా.. కొరియా.. అని అరుచుకుంటూ సత్య పరుగులు పెట్టే ఎపిసోడ్ బాగా పేలింది. సెకండాఫ్ లో కూడా క్షుద్ర పూజల నేపథ్యంలో వచ్చే మరో ఎపిసోడ్ సినిమాకే హైలైట్ గా నిలిచింది. హీరో అండ్ కో కొరియాలో అడుగు పెట్టాక కాసేపు విసుగు పుట్టించే 'కొరియన్ కనకరాజు' ఈ ఎపిసోడ్ నుంచే మళ్లీ పుంజుకుంటుంది. ప్రథమార్ధంలో నెమ్మదిగా మొదలై తర్వాత పైకి లేచినట్లే.. రెండో అర్ధంలో కూడా సినిమా కాస్త కింద పడి.. మళ్లీ పైకి లేస్తుంది. హీరో శరీరంలోకి చేరిన కొరియన్ ఆత్మ 'కథ' అయితే అంత ఆసక్తికరంగా లేదు. తన ఫ్లాష్ బ్యాక్ గురించి ఏదో ఊహించుకుంటాం కానీ.. అది తేలిపోయింది. కథ కొరియాకు షిఫ్ట్ అయ్యాక ఒక దశలో 'కొరియన్ కనకరాజు' బాగా బోర్ కొట్టిస్తుంది. కానీ అంతలో సత్య అందుకుని మళ్లీ ప్రేక్షకులను నవ్వుల్లో ముంచెత్తుతాడు. 'కొరియన్' మేకోవర్ తో వరుణ్ తేజ్ పెర్ఫామెన్స్ కూడా ప్రేక్షకులను ఎంగేజ్ చేస్తుంది. చివర్లో ట్రెండుకు తగ్గ 'డివైన్' యాంగిల్ జోడించి తీర్చిదిద్దిన క్లైమాక్స్ కొందరికి నచ్చొచ్చు. కొందరికి రుచించకపోవచ్చు. చివర్లో ఇచ్చిన ఫినిషింగ్ టచ్ లో మాత్రం గాంధీ మళ్లీ తన మార్కు చూపించాడు. ప్రేక్షకులను నవ్వులతో థియేటర్ నుంచి బయటికి పంపించాడు. ఓవరాల్ గా చెప్పాలంటే.. 'కొరియన్ కనకరాజు' స్టోరీ ఫార్మాట్ కొత్తది కాకపోయినా.. డిఫరెంట్ బ్యాక్ డ్రాప్ వల్ల వెరైటీగా అనిపిస్తుంది. సినిమా ఫుల్ ఫ్లోతో సాగకపోయినా.. టికెట్ డబ్బులకు సరిపడా నవ్వుల్ని పంచడంలో మాత్రం విజయవంతమైంది. నటీనటులు: వరుస ఫ్లాపుల తర్వాత వరుణ్ తేజ్ బాగా టైం తీసుకుని తనకు సూటయ్యే పాత్రను.. కథనే ఎంచుకున్నాడు. బాగా పెర్ఫామ్ చేయడానికి స్కోప్ ఉన్న పాత్రలో అతను ఆకట్టుకున్నాడు. తన భారీ విగ్రహం దయ్యం పాత్రకు ప్లస్ అయింది. మరో హీరో చేస్తే ఇంత ఇంపాక్ట్ ఉండ్డదా అన్న ఆలోచన కలిగేలా అతను ఈ పాత్రలో బలమైన ఇంపాక్ట్ చూపించాడు. దయ్యం పట్టాక వచ్చే మార్పులకు అనుగుణంగా అతను చూపించిన బాడీ లాంగ్వేజ్.. ముఖ్యంగా కొరియాలో వచ్చే మేకోవర్లో వరుణ్ తన ప్రత్యేకతను చాటుకున్నాడు. హీరోయిన్ రితిక యాదవ్.. క్యూట్ గా కనిపించి ఆకట్టుకుంది. ఆమె పెర్ఫామెన్స్ గురించి ప్రత్యేకంగా చెప్పుకునేలా లేకపోయినా.. ఓకే అనిపిస్తుంది. ఇక సత్య గురించి చెప్పేదేముంది? చిన్న హింట్ ఇస్తే అల్లుకుపోయే అతడికి అదిరిపోయే క్యారెక్టర్ పడింది. తన హావభావాలు.. కామెడీ టైమింగ్ పేలిపోయాయి. కొరియన్ దయ్యంగా చేసిన నటుడు మామూలుగానే అనిపిస్తాడు. అవసరాల శ్రీనివాస్ గురించి ప్రత్యేకంగా చెప్పుకునేలా ఏమీ లేదు. వీటీవీ గణేష్ నవ్వించలేకపోయాడు. సునీల్ పాత్రకు పెద్దగా స్కోప్ లేదు. మిగతా ఆర్టిస్టులంతా మామూలే. సాంకేతిక వర్గం: 'కొరియన్ కనకరాజు'కు తమన్ అందించిన సంగీతం అనుకున్నంత ప్లస్ కాలేదు. రాసా గుమ్మాడి పాట ఒకటి ఓకే. మిగతా సాంగ్స్ అన్నీ సాధారణంగా సాగిపోయాయి. తమన్ బీజీఎం ఎగుడుదిగుడుగా సాగింది. కొన్ని చోట్ల బాగున్నా.. కొన్ని చోట్ల ఆల్రెడీ విన్న ఫీలింగ్ కలిగిస్తుంది. కథలోకి కొరియన్ యాంగిల్ రాగానే.. మనం చూస్తోంది 'కొరియన కనకరాజు'నా లేక 'ఓజీ'నా అనిపించేలా.. అవే సౌండ్స్ తో చాలా వరకు సినిమాను లాగించేశాడు. పైగా అక్కడక్కడా వరుణ్ తేజ్ బాడీ లాంగ్వేజ్–హావభావాలు కూడా పవన్ కళ్యాణ్ ను గుర్తుచేయడంతో ఈ ఫీలింగ్ ఇంకా పెరుగుతుంది. మనోజ్ రెడ్డి ఛాయాగ్రహణం కలర్ ఫుల్ గా సాగింది. విజువల్స్ ఆద్యంతం ఆకట్టుకుంటాయి. సినిమాను మంచి క్వాలిటీతో నిర్మించారు. ప్రొడక్షన్ వాల్యూస్ బాగున్నాయి. ఇక రైటర్ కమ్ డైరెక్టర్ మేర్లపాక గాంధీ.. తన తొలి రెండు చిత్రాల స్థాయిలో కాకపోయినా మంచి ఎంటర్టైనరే తీశాడు. అతను ఎంచుకున్న కాన్సెప్ట్ బాగుంది. కొన్ని కామెడీ ఎపిసోడ్లను భలేగా తీశాడు. తన డైలాగులు కూడా బాగున్నాయి. ఈ మధ్యే సోషల్ మీడియాలో పాపులర్ అయిన సీనియర్ ఎన్టీఆర్ 'అమెచ్యూరిష్ పంచ్' డైలాగ్ మీదా పంచ్ పేల్చడం తన సెన్సాఫ్ హ్యూమర్ కు నిదర్శనం. తన రాతలో–తీతలో కొన్ని లోపాలున్నప్పటికీ.. ఒక కంప్లీట్ ఫిల్మ్ తీయకపోయినప్పటికీ.. గత రెండు సినిమాల్లా ఈసారి బోర్ అయితే కొట్టించలేదు. చివరగా: కొరియన్ కనకరాజు.. నవ్వించే ఫారిన్ దయ్యం రేటింగ్ – 2.75/5

## భావోద్వేగభరితంగా 'విశ్వనాథ్ & సన్స్' ట్రైలర్ !

### సూర్య 'విశ్వనాథ్ అండ్ సన్స్' ట్రైలర్ విడుదల – ట్రైలర్‌లో ఆకట్టుకునే భావోద్వేగాలు ఆలోచింపజేసే సంభాషణలు – ఆగస్టు 14న చిత్రం విడుదల



తమిళ కథానాయకుడు సూర్య నటిస్తున్న స్ట్రెయిట్ తెలుగు చిత్రం 'విశ్వనాథ్ & సన్స్' వెంకీ అట్లూరి దర్శకత్వంలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ సంస్థలు సంయుక్తంగా నిర్మించిన ఈ చిత్రాన్ని శ్రీకర స్టూడియోస్ సమర్పిస్తోంది. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించారు. ఆగస్టు 14, 2026న ప్రపంచవ్యాప్తంగా చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. కాగా ఈ చిత్రం ట్రైలర్‌ను శుక్రవారం (నేడు) విడుదల చేశారు మేకర్స్. ట్రైలర్‌ను గమనిస్తే ఫ్యామిలీ ఎమోషన్స్‌తో రూపొందుతోన్న కుటుంబ కథా చిత్రంగా 'విశ్వనాథ్ & సన్స్' ప్రేక్షకుల ముందుకు రాబోతుందనే విషయాన్ని ట్రైలర్ ద్వారా మేకర్స్ మరోసారి స్పష్టం చేశారు.

'నా బాబు ఒలింపిక్స్‌లో గోల్డ్ మెడల్ కొట్టాలి' అంటూ రాధికా శరత్ కుమార్ డైలాగ్ నుంచి, గెలిచే వరకు ఆగకూడదు.. గెలిచిన తరువాత ఆ గెలుపు గురించి ఎక్కువ మాట్లాడకూడదు అంటూ సూర్య చెప్పే డైలాగ్ వరకు ట్రైలర్ ఆద్యంతం ఎంతో భావోద్వేగభరితంగా అనిపిస్తుంది. 'నీ సీటు చాలా స్ట్రాంగ్', 'ఇప్పుడు ఎందుకు చంద్రముఖిలో జ్యోతికలా బిహేవ్ చేస్తున్నావ్' అంటూ కథనాయిక మమిత బైజు సూర్యను టీజ్ చేస్తూ చెప్పే సంభాషణలు ఫన్నీగా అనిపించాయి. ట్రైలర్‌లో ఎమోషన్స్, సెన్సిటివ్ ఎంటర్‌టైన్‌మెంట్, సెంటిమెంట్ ఇలా అన్నీ మిక్స్ చేసి దర్శకుడు సినిమా కథాంశాన్ని ఆడియన్స్‌కు ట్రైలర్ ద్వారా హింట్ ఇచ్చే ప్రయత్నం చేశాడు.

నలభై ఏళ్ల వయసులో అంతర్జాతీయ పిస్టల్ షూటర్‌గా సూర్య ఎలా ఎదిగాడు? అనే అంశాన్ని ఈ చిత్రంలో చూపించబోతున్నారు. ట్రైలర్‌తో ఆసక్తి కలిగించి సినిమా గురించి వెయిట్ చేసే విధంగా దర్శకుడు వెంకీ అట్లూరి చేసిన ట్రైలర్ కట్ బాగుంది. జీవీ ప్రకాష్ కుమార్ నేపథ్య సంగీతం ఆహ్లాదంగా అనిపించింది.



బ్లాక్ బోల్డ్, బ్యూటిఫుల్ మరియు అన్‌పోలోజెటిక్ చిత్రాల్లో చైత్ర జె ఆచార్ స్మోల్డర్స్ కన్నడ సినిమాలో ప్రభావవంతమైన పాత్రలకు ప్రసిద్ధి చెందిన చైత్ర జె ఆచార్ కేవలం ఒక వర్ధమాన తార మాత్రమే కాదు, ప్రతి పాత్రకు లోతు మరియు ప్రామాణికతను తీసుకువచ్చే బలమైన నటి.

Printed by:KALICHETI VENKAIAH, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Published by:KALICHETI VENKAIAH, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Owned by:KALICHETI VENKAIAH, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Printed at:SINDHURA DARSINI PUBLICATION, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Editor: KALICHETI VENKAIAH, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Email:SINDHURADARSINI.2023@Gmail.com, Cell:7569677170,RNI/APTEL/2023/87662